నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
సోమవారం | ఫిబ్రవరి 26, 2024 | www.navatelangana.com

లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నిక

నవతెలంగాణ-కామారెడ్డి



అధ్యక్ష, కార్యదర్శులకు సన్మానం

జిల్లా కేంద్రంలోని కామారెడ్డి లారీ ఓనర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పదవులకు గాను ఆదివారం అసోసియేషన్ సభ్యుల సమక్షంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ఎండి ఎజాజ్ ఖాన్, సలీం షరీఫ్ ఇద్దరు అభ్యర్థులు అధ్యక్ష పదవికి పోటీ పడగా ఎజాజ్ ఖాన్ లారీ ఓనర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గెలుపొందారు. ప్రధాన కార్యదర్శి బరిలో ముగ్గురు పోటీ పడగా ఎండి మాజీదుల్లా ప్రధాన కార్యదర్శిగా గెలుపొందారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో లారీ ఓనర్స్ అసోసియేషన్‌ను మరింత ముందుకు తీసుకెళ్తూ అందరికీ అండదండగా ఉంటూ లారీ ఓనర్ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని అధ్యక్షుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖలీల్ రెహమాన్, మోఎజ్, సలీం, ఆజం,రాజు ,ముజాహిద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి

- ఎస్‌కేఎం రాష్ట్ర నాయకులు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మూడ్ శోభన్ డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

రైతాంగ ఉద్యమంపై నిర్బంధాన్ని ఆపాలని, కనీస మద్దతు ధరల చట్టం చేయాలని, రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని ఎస్‌కేఎం రాష్ట్ర నాయకులు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మూడ్ శోభన్ డిమాండ్ చేశారు. కేంద్ర హెూం మంత్రి, హర్యానా ముఖ్యమంత్రిపై హత్యానేరం మోపాలని అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. అమరవీరుడు యువ రైతు శుభకరన్ సింగ్‌కు జోహార్లు తెలిపారు. ఆయన స్ఫూర్తితో రైతు పోరాటాన్ని తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు. రైతుల పోరాటాన్ని అణిచివేసేందుకు వ్యతిరేకంగా దేశం అంతటా రైతులను చైతన్యవంతం చేయాలని కోరారు.

వివరాలు మెయిన్‌లో..

జంపింగ్ 'రాజ'కీయాలు

- అధికార పార్టీలోకి పెరుగుతున్న వలసలు

నవతెలంగాణ-మోపాల్



బెల్లం చుట్టూ ఈగలు వాలినట్టు.. అధికార పార్టీలలోకి వలసలు క్రమంగా కొనసాగుతున్నాయి. గతంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండగా.. ఇతర పార్టీల నుంచి ఆ పార్టీలోకి చేరికలు చోటుచేసుకోగా.. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ ప్రతిపక్షంలో ఉండటంతో ఆ పార్టీ నుంచి పలువురు అధికారంలోకి ఉన్న కాంగ్రెస్‌లోకి వలస కడుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల వేళ అధికార పార్టీలోకి వలసలు పెరుగుతున్నాయి. గతంలో పార్టీల సిద్ధాంతాలకు ఆకర్షితులపై ఆయా పార్టీలపై అభిమానం పెంచుకొని స్వయంగా చేరే వారు. కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో అధికారమే పరమావధిగా, ఇతరాత్ర సమస్యలతో పార్టీల్లో చేరికలు చోటుచేసుకుంటుండటం గమనార్హం.

అధికారంలో ఉన్నన్ని రోజులు రాజభోగాల అనుభవించిన వారు.. అధికారం మారడంతో వారు సైతం అధికారంలో ఉన్న పార్టీలోకి మారుతున్నట్టు పలువురి తీరుపై స్థానికంగా వ్యతిరేకత వ్యక్తమవుతుంది. అధికారంలో ఉన్నన్ని రోజులు తమ అధికార పార్టీ వాళ్ళం అని విర్రవీగుతూ ప్రభుత్వ ఆఫీసుల్లో పెత్తనం చెలాయించేవారు ఏ సంక్షేమ పథకాలు వచ్చినా కూడా ముందు వరుసలో వారే ఉండేవారు. లబ్ది పొందిన వాళ్లలో చాలామంది అధికారం కోల్పోయిన వెంటనే ఇతర పార్టీలో చేరి మళ్లీ అక్కడ కూడా వారి పెత్తనమే సాగేటట్టు చూస్తున్నారు. పోనీ వాటిలో చేరిన వెంటనే సైలెంట్‌గా ఉండకుండా అక్కడ కష్టపడ్డ వారిని పక్కకు నెట్టేసి ఆ పార్టీ అధికారం రావడం కోసం అక్కడ పార్టీలో ఉన్న కార్యకర్తలు అందరూ రాత్రింబవలు కష్టపడి తమ పార్టీ అధికారంలోకి వస్తే తమదే రాజ్యం అనుకుంటే వాళ్ళని తొక్కి పెట్టి పెత్తనం చేలాయిస్తున్నారు. ఈ విధంగా చూసుకుంటూ పోతే నిజమైన కార్యకర్తకు గుర్తింపు ఉండటం లేదు. కనీసం వారికి మర్యాద కూడా దొరకడం లేదు. గెలిచిన ఎమ్మెల్యేలు సైతం వారిని నిర్లక్ష్యం చేస్తున్నారు. వారి గోస మాటల్లో వర్ణించలేని విధంగా ఉంది. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే వేరే పార్టీ నుంచి వచ్చిన వారికి అధిక ప్రాధాన్యతిస్తున్నారని బహిరంగ రహస్యం.

పెండింగ్ బిల్లులు, నామినేటెడ్ పోస్టులు..

చేరికల సందర్భంగా పలువురు తమకు పెండింగ్ బిల్లులకు మోక్షం కల్పిస్తారనే ఆశతో చేరుతుండగా.. మరికొందరు ఏదో ఒక నామినేటెడ్ పోస్టు దక్కక పోదా అని అధికార పార్టీలోకి క్యూ కడుతున్నట్టు భోగట్ట.

రైతులపై లాఠీచార్జి హేయనీయం

- నేడు ఆందోళనలను జయప్రదం చేయండి : ఎస్‌కేఎం

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న ఎస్‌కేఎం రాష్ట్ర నాయకులు మూడ్ శోభన్

రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని శాంతియుతంగా ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన వ్యక్తం చేస్తున్న రైతులపై లాఠీచార్జ్ చేయడం హేయనీయమని ఎస్‌కేఎం (సంయుక్త కిసాన్ మోర్చా) నాయకులు తీవ్రంగా ఖండించారు. లాఠీచార్జికి నిరసనగా.. నేడు(సోమవారం) రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపటడుతున్నా మని, జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం నిజామాబాద్ నగరంలోని కమ్మ సంఘం భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సమావేశంలో సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు మూడ్ శోభన్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధరల చట్టం చేయాలని రైతులు ఇటీవల ఢిల్లీలో ఆందోళన చేస్తున్నప్పటికిని హర్యానా ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం అక్కడ రైతులు ఆందోళన చేస్తున్న పోరాటంపై రబ్బరు బుల్లెట్లు ప్రయోగించడంతో ఒక యువరైతు మృతిచెందినట్టు తెలిపారు. నలుగురు రైతులు గుండెపోటుతో మృతిచెందినట్టు తెలిపారు. అయినా ప్రభుత్వం రైతులపై పాశవికంగా రబ్బరు బుల్లెట్లతో దాడి చేయడం సిగ్గుచేటని అన్నారు. రైతులు కనీస మద్దతు ధరల చట్టం చేయాలని బిజెపి ప్రభుత్వం ఇచ్చిన హామీలు రాతపూర్వక హామీల అమలు చేయాలని దేశవ్యాప్తంగా నేడు జరిగే ట్రాక్టర్ ర్యాలీలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నిజామాబాద్ జిల్లాలో కూడా బైకు ర్యాలీని ఉదయం 11 గంటలకు గాంధీ చౌక్ నుండి చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏం గంగాధరప్ప ,పల్లపు వెంకటేష్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమన్న, రైతు నాయకులు డి కష్ట గౌడ్, శ్రీనివాసరెడ్డి ,బస్సీ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- కార్యకర్తలకు ఎమ్మెల్యే సూచన



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-లింగంపేట్

కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తుందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు తెలిపారు. లింగంపేట్ మండలంలో ఆయా గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు లింగంపేట్ జడ్పిటిసి ఏలేటి శ్రీలత సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో ఆదివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో చేరారు. లింగంపేట వైస్ ఎంపీపీ విట్టల్ రెడ్డి, ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఒంటరి సిద్ధారెడ్డి, ఐలాపూర్ ఎంపీటీసీ దేవేందర్, లింగంపేట సింగిల్ విండో డైరెక్టర్ సాయగౌడ్, బాణాపూర్ తాండ సర్పంచ్ లతా పీర్ సింగ్, నాగులూరి సాయిలు, దేవి సింగ్ తో పాటు పలువురు చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంక్షేమ పథకాలు నేరుగా ప్రజలకు వివరించాలని రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో జయరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కైవాసం చేసుకుంటుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేయాలన్నారు. మరి కొంతమంది ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలో చేరడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం.

పారిశుధ్య కార్మికులకు సన్మానం



పారిశుధ్య కార్మికులకు సన్మానం

నవతెలంగాణ-కామారెడ్డి

సామాజిక సమరసత వేదిక కామారెడ్డి ఆధ్వర్యంలో టెక్రియల్ మున్సిపల్ వార్డ్ లో సమతా మూర్తుల జయంతుల సందర్భంగా పారిశుధ్య కార్మికులను సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక సమరసత వేదిక జిల్లా సమయోజకులు బాల్ రాజ్ గౌడ్, జిల్లా అధ్యక్షులు అమృత రాజేందర్ మాట్లాడార. దేశంలో 5 వేలకు పైగా కులాలు వున్నాయనీ, వేద కాలంలో ఇన్ని లేవన్నారు. కాలక్రమేణా సమాజ నిర్మాణంలో పనులు వృత్తుల రూపంలో కొనసాగించి, వావి వరుసలతో పిలుస్తూ, గ్రామీణ స్వయం పరిపాలన లో అన్యోన్య సహకారం, సమన్వయంతో ఉత్తమ గ్రామ పంచాయతీ వ్యవస్థ 7 లక్షల గ్రామాల్లో రూపొంది, ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలు బలోపేతం అయి, ప్రపంచంలోనే భారత దేశం ఒక స్నేహ పూరిత, వాణిజ్య, ఆధ్యాత్మిక దేశంగా అన్ని దేశాలతో సత్సంబంధాలు పెట్టుకుని, విశ్వ కుటుంబ వాతావరణం నెలకొల్పిందన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక సమరసత వేదిక కామారెడ్డి నగర కన్వీనర్ దత్తు రావు, ప్రధాన కార్యదర్శి మన్నే కృష్ణ, సాయిలు, నర్సింలు, నరసయ్య, రామ స్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

నవతెలంగాణ-కామారెడ్డి

పట్టణంలోని పీపుల్ ఫర్ ఇండియా భవన సముదాయంలో నేడు (సోమవారం) కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు బీజేపీ నాయకులు తెలిపారు. కరపత్రాలను ఆదివారం గర్గుల్ గ్రామంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా కార్యదర్శి తేలు శ్రీనివాస్ మాట్లాడుతూ శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో (జిల్లా అంధత్వ నివారణ సంస్థ కామారెడ్డి) శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణా రెడ్డి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం సోమవారం పీపుల్ ఫర్ ఇండియా భవన సముదాయం లో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించనున్నటుట తెలిపారు. అవసరం ఉన్న వారికి ఉచిత అద్దాలు, అవసరం అయిన వారికి శస్త్ర చికిస్త నిర్వహిస్తారని, కంటి సమస్యలు ఉన్న వారు అవకాశాన్ని వినియోగించుకోవాలనీ విజ్ఞప్తి చేశారు.

ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్ట్ అభినందనీయం

- పోరాటాలే కాకుండా విద్యార్థుల ప్రతిభ వెలికి తీయడం గొప్ప విషయం
- పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ ప్రశ్నపత్రాలను విడుదల చేసిన ఐటీఐ మాజీ ప్రిన్సిపల్ రామ్మోహన్‌రావు

నవతెలంగాణ-కంఠేశ్వర్



ఎస్ఎఫ్ఐ చేపట్టిన టాలెంట్ టెస్ట్ ప్రశ్నపత్రాలను విడుదల చేస్తున్న పలువురు

ఎస్ఎఫ్ఐ (భారత విద్యార్థి ఫెడరేషన్) నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థుల ప్రతిభ వెలికి తీసేందుకు ప్రత్యేకంగా చొరవ చూపి టాలెంట్ టెస్ట్ నిర్వహించడం అభినందనీయం అని ఐటిఐ మాజీ ప్రిన్సిపల్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత రామ్మోహన్‌రావు కితాబిచ్చారు. విద్యార్థులలో మనోధైర్యం కోల్పోకుండా, బోర్డ్ ఎగ్జామ్స్ రాసే విద్యార్థుల భయాన్ని పోగొట్టే ఆలోచన చేయడం ఎస్ఎఫ్ఐ క్రమశిక్షణకు నిలువుటద్దమని కొనియాడారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నగరంలోని కాకతీయ గోదావరి క్యాంపస్‌లో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహిం చారు. ప్రతిభ పరీక్షల ప్రశ్న పత్రాలను ఐటీఐ మాజీ ప్రిన్సిపాల్ రామ్మోహన్ రావు, ఎస్ఎఫ్ఐ పూర్వ అధ్యక్షులు రమేష్‌బాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రావు మాట్లాడుతూ తాము చదువు తున్న కాలం నుండి ఎస్ఎఫ్ఐ పోరాటాలే కాకుండా ఇలాంటి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుం దని అన్నారు. విద్యార్థులు చదువును కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి 10/10 సాధించాలనే పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు.

చదువు అన్నింటికీ మార్గమని ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి రమేష్ బాబు అన్నారు. ఎస్ఎఫ్ఐ పోరాటాలు చేపట్టడంతో పాటు విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు ఎల్లప్పుడు ముందు ఉంటుందని అన్నారు.

అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బొడ అనిల్ మాట్లాడుతూ ప్రతిభ పరీక్షలు నిజామాబాద్ నగరంలో నాలుగు సెంటర్లలో నిర్వహించినట్టు తెలిపారు. అదే విధంగా ప్రభుత్వ విద్యారంగం బలోపేతం విద్యా విధానాన్ని అమలు చేయాలని అధ్యయనం పోరాటం నినాదంతో ఎల్లప్పుడూ పోరాటాలే కాకుండా విద్యార్థులలో సజనాత్మకతను వెలికి తీస్తున్న ఏకైక విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ అని అన్నారు. జిల్లా కేంద్రంలో దాదాపుగా 1800మంది విద్యార్థులు టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్నట్టు తెలిపారు. ఈ ప్రతిభ పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకతీయ ఇంఛార్జి ప్రసాద్, రిటైర్డ్ టీచర్ శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి మహేష్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు దీపిక, సంధ్య రెడ్డి, తెలంగాణ యూనివర్సిటీ అధ్యక్షులు ప్రసాద్, నాయకులు వేణుగోపాల్, బాబురావు, దినేష్, చిత్రు, సునిల్, సంతోష్, సుమశ్రీ, దివ్య వైష్ణవి,తదితర నాయకులు పాల్గొన్నారు.





ఆదర్శ కమ్యూనిస్టు పరుచూరి కుటుంబరావు

- వామపక్ష నాయకుల నివాళి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



జోహార్లు అర్పిస్తున్న వామపక్ష నాయకులు

ఆదర్శ కమ్యూనిస్టు పరుచూరి కుటుంబరావు అని.. కమ్యూనిస్టు విలువలు చాలా గొప్పవి, ఆ సిద్ధాంతాలు ఆయా కుటుంబాలను ఉన్నతంగా నిలబెడతాయి అని మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు అన్నారు. సిపిఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ పార్టీ నగర కార్యదర్శి (అడ్వకేట్) పరుచూరి శ్రీధర్ తండ్రి పరుచూరి కుటుంబరావు ప్రథమ వర్ధంతి సందర్భంగా వారికి పలువురు నివాళులు అర్పించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మాధవనగర్ కమ్మ సంఘంలో జరిగిన ఈ సంస్మరణ సభలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు గొర్రెపాటి మాధవరావు అధ్యక్షత వహించగా పలువురు వక్తలు ప్రసంగించారు. ఈ సందర్భంగా హాజరైన మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చివరి వరకు కుటుంబరావు తాను నమ్మిన సిద్ధాంతం పట్ల నిబద్ధతో ఉంటూ గ్రామంలో తారతమ్యాలు లేకుండా ఏ సమస్య వచ్చినా నిక్కచ్చిగా నిలబడి తప్పును తప్పని, న్యాయం ఎటువైపు ఉంటే అటువైపు నిలబడే వారని గుర్తుచేశారు. ఒక సందర్భంలో మనసు నొప్పించుకున్న వాళ్లకు తర్వాత వారికి ఏది న్యాయబద్ధంగా ఉందో అర్థం చేసుకుంటే చాలు అనే వారని అన్నారు. ఏది న్యాయమైన నిర్ణయం అయితే అదే నిర్ణయం చేసేవారని కొనియాడారు. అలాంటి గొప్ప వ్యక్తి కుటుంబ సభ్యులను కూడా వామపక్ష భావజాలానికి పరిచయం చేసి ఆదర్శంగా తమ పిల్లలను తీర్చిదిద్ది వామపక్ష పార్టీలో పనిచేసే విధంగా, నిలబడే విధంగా ప్రోత్సహించినటువంటి గొప్ప వ్యక్తి మేధావుల కన్నా మేధస్సు ఎక్కువ కలిగిన మహా గొప్ప వ్యక్తి మాధవ నగర్ లెజెండ్ కుటుంబరావు అని అన్నారు.

సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర నాయకులు వేములపల్లి వెంకట రామయ్య మాట్లాడుతూ నిరంతరం పేద ప్రజల అభ్యున్నతి కోసం ప్రయత్నించాడని, కుటుంబరావు పేదల పక్షపాతి అని పేర్కొన్నారు. పాతతరం కమ్యూనిస్టు బాబాజాలాన్ని కొత్త తరం ఆలోచనలని జోడించి కమ్యూనిస్టు బావాజాలాన్ని విస్తతపరచాడని గుర్తు చేశారు. కమ్యూనిస్టు ఉద్యమానికి తానే కాకుండా తన కుటుంబమంతా వెన్నుదండగా నిలిచారని తెలిపారు.

న్యూడేమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య మాట్లాడుతూ జిల్లాలో సింగూరు జలాలు ఇందూరు హక్కు అని జరిగిన రైతాంగ పోరాటంలో కుటుంబరావు కృషి మరువలేనిదని పేర్కొన్నారు. అంతే కాకుండా మాధవనగర్ లోని అనేక సమస్యలపై పోరాటాలు చేశారని గుర్తు చేశారు. బతికినంత కాలం పేద ప్రజల కోసం బతుకుతూ తాను నమ్మిన కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని బతికిస్తూ చివరికి తాను మరణించాక కూడా మెడికల్ విద్యార్థుల కోసం తన భౌతిక కాయాన్ని అందించడం భవిష్యత్ తరాలకు ఆదర్శం అని అన్నారు. ఈ కార్యక్రమంలో పరుచూరి శ్రీధర్, పరుచూరి మురళి అరుణ రేఖ, ఝాన్సీ రాణి కలగల సంధ్యారాణి సిపిఎం నాయకులు శోభన్, గంగాధరప్ప, న్యూ డెమోక్రసీ పార్టీ నాయకులు ఎన్ దాసు వేల్పురి భూమయ్య, నీలం సాయిబాబా ఏం శివకుమార్, మాధవ్ నగర్ గ్రామ పెద్దలు, కుటుంబరావు స్నేహితులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఫీజుల కోసం విద్యార్థులను వేధిస్తున్న పలు విద్యాసంస్థలు

చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్



మాట్లాడుతున్న శివప్రసాద్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లాలో ప్రవేటు జూనియర్ కళాశాలలు, ప్రైవేటు స్కూళ్ల పరీక్షల సమయంలో ఫీజులు కడితేనే హాల్ టికెట్ ఇస్తాము అని విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని, అలాంటి కళాశాలలపై, పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ అఖిల భారత విద్యార్థి సమైక్య కామారెడ్డి జిల్లా కన్వీనర్ శివప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఫీజులు చెల్లిస్తేనే పాఠశాలలో పరీక్షలు రాయనిస్తాము అంటూ విద్యార్థులను పలు ప్రయివేటు స్కూళ్లు ఇబ్బందులకు గురిచేస్తున్నా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. అడ్మిషన్ల చేసుకొనే ముందు విద్యార్థులకు మాయమాటలు చెప్పి ఇప్పుడు పరీక్షలకు ముందు ఇంటర్మీడియట్ విద్యార్థులకు పూర్తిగా ఫీజులు కడితేనే హాల్ టికెట్ ఇస్తామని భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. అడ్మిషన్ల ముందు స్కాలర్షిప్ ఇస్తే చాలు అన్నవారు స్కాలర్షిప్ల రానందున విద్యార్థులను పాఠశాలల, కళాశాల కార్యాలయం ముందు నిలబెట్టి తల్లిదండ్రుల నుండి ఫీజులు దోపిడీ చేస్తున్నారని, ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు కళాశాలల పైన చర్యలు తీసుకోవాలని, ప్రతి ఒక్క విద్యార్థి పరీక్షలు రాసే విధముగా చూడాలన్నారు. లేకుంటే కళాశాలల ముందు ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు రాజేందర్, సంపత్, వీరేందర్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టాఫీస్‌లో నేడు ప్రత్యేక మేళా

నవతెలంగాణ-కామారెడ్డి డెస్క్

పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలోని పోస్టాఫీస్‌లో (నేడు) సోమవారం నిర్వహించే మేళను సద్వినియోగం చేసుకోవాలని పోస్ట్ మాస్టర్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. సోమవారం నాడు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు కేంద్ర ప్రభుత్వం పోస్ట్ ఆఫీస్ ద్వారా తక్కువ ప్రీమియంతో ఎక్కువ భీమా అందించే విధంగా పథకాలను అందజేస్తుందని, 520 రూపాయలతో 10 లక్షల ప్రమాద బీమా పొందవచ్చని 18 సంవత్సరల నుండి 65 సంవత్సరాల వయస్సు వారు అర్హులరని ఆయన తెలిపారు.

దళితబంధు మంజూరు చేయండి

- ఉప ముఖ్యమంత్రిని కలసిన లబ్ధిదారులు



ఉపముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న లబ్ధిదారులు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లాలోని రెండవ విడత దళితబంధు లబ్ధిదారులకు నిధులను మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కను కామారెడ్డి నియోజకవర్గ రెండవ విడతలో మంజూరు అయిన దళితబంధు లబ్ధిదారులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి విక్రమార్క సానుకూలంగా స్పందించి, ప్రభుత్వం దష్టిలో దళిత బంధు పథకంలో ఫ్రీజ్ అయిన నిధులు ఎవరికైతే సగభాగం మంజూరై, కొంతమందికి పెండింగ్ లో ఉన్నాయో అవి పూర్తిగా నిధులు మంజూరు చేసిన తర్వాత రెండో విడతలో కొన్ని నియోజక వర్గాలలో ఎంపిక చేసినట్టు తెలిపారు. ఎంపిక చేసినటువంటి లబ్ధిదారుల విషయమై ప్రభుత్వం ఇంకా ఎలాంటి ఆలోచన చేయలేదని, ముందు ముందు ఆలోచిస్తామని బట్టి విక్రమార్క తెలిపారు. ఈ కార్యక్రమంలో కంకణాల రవీందర్, స్వామి, నర్సింలు, నర్సింలు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
నిజామాబాద్
సోమవారం | ఫిబ్రవరి 26, 2024 | www.navatelangana.com

నేడు ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ



నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలోని మిర్జాపూర్ క్యాంపులో సోమవారం నిర్వహించే ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ సందర్భంగా ఏసిపి శ్రీనివాస్ ఆదివారం పరిశీలించారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ మంత్రివర్యులు మండవ వెంకటేశ్వరరావు, మాజీ శాసనసభాపతి, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి తదితరులు హాజరవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విగ్రహ పనులను పోచారం సురేందర్ రెడ్డి తదితరులు పరిశీలించారు.

క్షేత్రస్థాయిలో పరిశీలించి అభివృద్ధి చేయాలి

- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ జిల్లా అధ్యక్షులు సుంకం భూషణ్



నవతెలంగాణ-ఆర్మూర్

నేడు అనేక గ్రామాలలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ప్రజలు పేదరికంలో ఉన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం భూమి, ఇండ్లు, ఉపాధి లేనివారు ఎంతమంది ఉన్నారని క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి వారి అభివృద్ధికి కృషి చేయాలని బీసీ ,ఎస్సీ ఎస్టీ, మైనారిటీ జిల్లా అధ్యక్షులు సుంకం భూషణ్ ఆదివారం తెలిపారు. కులవృత్తుల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, బీసీలను ఐక్యం చేసి రాజ్యాధికారం సాధించి వారిలో ఉన్న పేదరికాన్ని శాశ్వతంగా నిర్మూలించాలని ప్రభుత్వాన్ని కోరారు. మైనారిటీ, బీసీ, ఎస్సీ, ఎస్టీలలో పేద ప్రజలు ఎందరో ఉన్నారని,, క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి వారి కుటుంబాలను అభివృద్ధి చేయడంలో ప్రభుత్వం శ్రద్ధ చూపాలని తెలిపారు.

పొగాకు బెరడుతో విత్తనాల తయారీ

- స్వయంగా తయారు చేస్తున్న రైతులు

నవతెలంగాణ-రెంజల్

పొగాకు పంట పండించిన రైతులు వాటి ఆకులను తొలగించి నీటిని అందిస్తూ విత్తనాల తయారు చేసుకోవడానికి వాటి బెరడులను అలాగే వదిలివేస్తే పైభాగంలో చిన్న చిన్న కాయలు కాసి దాంట్లో విత్తనాలు తయారవుతాయి. వాటన్నింటిని కూలీలతో తెంపి ఒకచోట వేస్తే పొగాకు విత్తనాలు తయారవుతాయని రైతులు పేర్కొన్నారు. వాటిని వచ్చే సంవత్సరం ఇసుకలో కలిపి చల్లినట్లయితే పొగాకు నారు తయారవుతుందని రైతు అవేజ్ ఖాన్ పేర్కొన్నారు. తన ఏడు ఎకరాల పొగాకు పంటలో ఒక ఎకరం వరకు అలాగే బెరడులను వదిలి నీటిని అందించడంతో పైభాగంలో విత్తనాలు తయారవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. వాటిని కొనుగోలు చేసే బదులు నాణ్యమైన విత్తనాలను తయారు చేసుకునే అవకాశం రైతులకు కలుగుతుందని ఆయన అన్నారు. మిగతా పొగాకు కట్టెలను చదునుచేసి వాటిని పొగాకు బట్టిలకు వాడుకుంటామని ఆయన పేర్కొన్నారు. పువ్వుకు నారు వేసే సమయంలో విత్తనాలతో పాటు ఇసుకను కలిపి చల్లుతే పొగాకు నారు తయారవుతుందని ఆయన పేర్కొన్నారు.



విత్తనాల కోసం ఉంచిన పొగాకు

బెరడులను విత్తనాలకోసం వదిలేస్తాం

అవేజ్ ఖాన్-రైతు నీలా పేపర్ మిల్



ఏడు ఎకరాల భూమిలో పొగాకు పంట పండించాను. పొగాకు సేకరించిన అనంతరం పొగాకు తీసిన బెరడులను విత్తనాల కోసం వదిలివేస్తాం. మిగతా బెరడులను పొగాకు బట్టిల్లో పొగ చూడడానికి వాడుకుంటాం. రైతులు స్వతహాగా తయారు చేసుకున్న విత్తనాలతో పొగాకు పంట ఏపుగా పెరుగుతుంది. పొగాకు నారుమళ్ళల్లో కొంత తమ సొంతానికి వాడుకొని మిగతాది రైతులకు విక్రయిస్తాం.

పొగాకుకోసం మండెలు ఏర్పాటు

రెంజల్: మండలంలోని కందకుర్తి గ్రామంలో పొగాకు బట్టీలలో పొగాకు తయారైన తర్వాత వాటికి నలుపు రంగు వచ్చేవరకు ఒకచోట మండెలు కట్టి దానిపై పాలిథిన్ కవర్‌తో వారం రోజులపాటు కప్పి ఉంచుతారు. అలా ఉంచడం వల్ల లోపల వేడి తగిలి పొగాకు నల్ల రంగులో మారుతుందని వారు తెలిపారు. టొబాకో కంపెనీ వారు పంటకు ఏ గ్రేడ్, బి గ్రేడ్‌గా నిర్ణయించి ధరను నిర్ణయిస్తారు. రైతులు పండించిన పంట ఏ గ్రేట్ లో రావాలన్న తలంపుతో వారు నానా అవస్థలు పడుతూ నలుపు రంగు కోసం అవస్థలు పడాల్సి వస్తుందని వారు పేర్కొన్నారు.



మండెలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

కోడి శ్రీరాములకు జోహార్లు



నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు కోడి శ్రీరాములు గానం, మాట, ఆట తుదికంట కొనసాగిస్తామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసు తెలిపారు. సంతాప సభ నిజామాబాద్ నగరంలోని మాధవ నగర్‌లో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసు మాట్లాడుతూ కోడి శ్రీరాములు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అరుణోదయ అధ్యక్షులుగా పనిచేస్తూ, అనేక ఉద్యమాలకు తన ఆటపాటతో ఉత్తేజాన్ని అందించారని ఆయన తెలిపారు. కోడి శ్రీరాములు ఉద్యమ స్ఫూర్తితో ప్రజా కళకారులు ప్రజల పక్షాన నిలబడాలని దాసు పిలుపునిచ్చారు. సంతాప సభలో నిజామాబాద్ జిల్లా అరుణోదయ ప్రధాన కార్యదర్శి అబ్దుల్, బండమీది నరసయ్య, రంజిత్, భారతి, స్నేహిత,సాయ రెడ్డి, ప్రజా సంఘాల శివకుమార్, జెల్లా మురళి, మోహన్, నర్సింగ్, కృష్ణ గౌడ్, కత్తి సాయిలు, టి రాజు, బాబురావు, చిన్నయ్య,సంజీవ్ తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు

టీయూలో స్వచ్ క్యాంపస్



నవతెలంగాణ-డిచ్‌పల్లి

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ తెలంగాణ యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో ఎస్ఎఫ్‌డీ స్టుడెంట్ ఫర్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో స్వచ్ఛ్ క్యాంపస్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆవరణలో ప్లాస్టిక్, చెత్తను తీసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్‌డీ నాయకులు మాట్లాడుతూ.. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అప్పుడే అనారోగ్యం బారిన పడకుండా ఉంటామని వివరించారు. ప్రజలందరూ ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్‌డీ జిల్లా కన్వీనర్ ప్రమోద్, యూనివర్సిటీ కన్వీనర్ హరినాథ్ రెడ్డి, ఎబివిపి జాతీయ కార్యవర్గ సభ్యులు శివ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులునాగరాజు, యూనివర్సిటీ ప్రెసిడెంట్ సాయి, సెక్రటరీ అమృత్ చారి, ఉపాధ్యక్షులు, పావని, అనిల్, తరుణ్, జాయింట్ సెక్రటరీలు, హరిక్రిష్ణ, సమీర్, మని, అక్షయ్, సచిన్ నాయకులు పాల్గొన్నారు.

సైకిళ్ల పంపిణీ



విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తున్న రోటరీ క్లబ్‌వారు

నవతెలంగాణ-ఆర్మూర్

రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ నార్త్ వారి సౌజన్యంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ పాఠశాలకు వెళ్లడానికి ఇబ్బందిగా ఉన్న బాలికలకు ఉచితంగా 50వేల విలువ గల సైకిల్స్ ఆదివారం వితరణ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన పాస్ట్ డిస్టిక్ గవర్నర్ హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ రోటరీ క్లబ్ నార్త్ వారి నిధుల సహకారంతో ప్రతి సంవత్సరం పాఠశాలకు వెళ్లడానికి ఇబ్బందికరంగా ఉన్న బాలికలకు ఉచితంగా సైకిల్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. రోటరీ అధ్యక్షుడు పట్వారి గోపి కృష్ణ మాట్లాడుతూ దీనికి తోడ్పడిన హైదరాబాద్ నార్త్ రోటరీ సభ్యులకు అందరికీ ధన్యవాదాలు అని అన్నారు. బాలికలు చక్కగా చదువుకొని ఉన్నత స్థాయిలో నిలవాలని తెలిపారు. కార్యక్రమంలో పద్మ మురళీ, విజయ సారధి , చరణ్ రెడ్డి, పుష్పకర్ రావు, లింగాగౌడ్, ఎంకె.నరేందర్, గోనె దామోదర్, ఎల్. కే.రాజు , రాస ఆనంద్, చౌటి లింబాద్రి, ఖాందేశ్ సత్యం, గోనె శ్రీధర్, నర్సయ్య, బాలికలు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నలంద పాఠశాలలో

కెసాట్ లెవెల్-2 రాష్ట్రస్థాయి పరీక్షలు



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి నలంద హై స్కూల్ లో ఆదివారం ఈ అభ్యాస్ అకాడమీ, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో కె-సాట్- 2 (కలాం సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్) రాష్ట్రస్థాయి పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షలో వివిధ జిల్లాలకు చెందిన మూడో తరగతి నుండి పదవ తరగతి విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షకు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన విద్యార్థులు దాదాపుగా 300 మంది హాజరయ్యారు. పరీక్ష సెంటర్ ఏర్పాటుచేసిన నలంద హై స్కూల్ యాజమాన్యం ప్రసాద్, సాగర్ మాట్లాడుతూ నేటితరం విద్యార్థులకు ఐఐటి, కాంపిటీటివ్ పరీక్షలకు విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో తోడ్పాటునందిస్తుందనే ఉద్దేశంతో గత నాలుగు సంవత్సరాలుగా తమ పాఠశాలలో ఒలంపియాడ్, ఐఐటి విద్యను బోధిస్తున్నామని తెలిపారు. ఒలంపియాడ్, ఐఐటి ఉపాధ్యాయులు అక్షయ్, హనుమాన్లు, ప్రవీణ్, సందీప్, మౌనిక, వాసవి, అలీనా ఉపాధ్యాయులకు యాజమాన్యం కృతజ్ఞతలు తెలియజేశారు. అన్ని ఏర్పాట్లు చేసి సెంటర్ ను కేటాయించినందుకు నలంద యాజమాన్యానికి ఈ అభ్యాస్ అకాడమి వారు కృతజ్ఞతలు తెలిపారు. నేడు సోమవారం ఇంగ్లీష్ ఫెస్ట్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమానికి అందరూ తల్లిదండ్రులు హాజరుకావాలని కోరారు.

నిరుద్యోగుల కోసం జాబ్ మేళా ఏర్పాటు చేస్తా

- ఎమ్మెల్యే ధన్‌పాల్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిరుద్యోగిత తగ్గడం కోసం తన వంతు కృషి ఎప్పుడు ఉంటుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలోని దుబ్బ ప్రాంతంలో గల అక్షరాధామ్ స్కూల్‌లో ఆదివారం జెన్ పాక్ట్ వారి జాబ్ మేళాకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూసి గత పదేళ్లుగా కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణాలో ఉద్యోగాలు కరువయ్యాయని, ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులకు ఇది సువర్ణ అవకాశం అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా నిరుద్యోగ నిర్మూలన కోసం అనేక సెల్ఫ్ ఎంప్లాయ్ స్కీమ్స్ తీసుకువచ్చిందని, ఇందూర్ లో రాబోయే రోజుల్లో నిరుద్యోగ యువత కోసం నా వంతుగా, వారికీ కేంద్రం ప్రభుత్వ పథకాల నుండి సహాయ సహకారాలు అంది స్తానని అన్నారు. ప్రైవేట్ ఐటి కంపెనీ లతో త్వరలో మాట్లాడి బిగ్ జాబ్ జాబ్ మేళా ఏర్పాటు చేస్తానని తెలిపారు. ఈ ఇంటర్వ్యూలో ఉద్యోగం సాధించిన వారికి సంవత్సరానికి 2.4 లక్షల వరకు జీతం చెల్లిస్తారన్నారు ఉద్యోగానికి ఎంపికైన వారు హైదరాబాదు లోని హఫీజ్ పేట్ లో పనిచేయాల్సి ఉంటుందని ఆయన వివరించారు. కార్యక్రమంలో జెన్ పాక్ట్ హెచ్.ఆర్ వైష్ణవి, బిజెపి నాయకులు అసెంబ్లీ కన్వీనర్ పంచారెడ్డి లింగం, అసెంబ్లీ కోకన్వీనర్ నారాయణ యాదవ్, కార్పొరేటర్ పంచారెడ్డి ప్రవళిక శ్రీధర్, మండల అధ్యక్షులు గడ్డం రాజు, నాయకులు బీజేపీ నాయకులు పవన్ ముందడ, బట్టికిరి ఆనంద్, రాజేందర్, భాస్కర్, రాకేష్, స్కూల్ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

పాఠశాలకు ప్రహరీ నిర్మించండి



ప్రహారి గోడ లేని ఖిల్లా పాఠశాల

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగరంలోని ఖిల్లా రోడ్‌లోగల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మించకపోవడంతో ఆ పాఠశాలకు పంపే విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఖిల్లా రోడ్‌లోగల మెయిన్ రోడ్డుకు పాఠశాల ఆనుకొని ఉంది. ఈరోడ్డునుండి వందల సంఖ్యలో వాహనాలు వెళుతుంటాయి. అందువల్ల పాఠశాలకు ప్రహరీ గోడను ఏర్పాటు చేసి, గేటు పెట్టాలని కోతున్నారు. దీనివల్ల విద్యార్థులు పాఠశాల ఆవరణలో నుండి బయటకు రాకుండా ఉంటారని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. ఈ పాఠశాలలో 25 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు

డిఏలను విడుదల చేయాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్

కోరి తెచ్చుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగుల, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా శాఖ విజ్ఞప్తి చేసింది. గత ప్రభుత్వంలో 22-23 జూలై, జనవరి రెండు డిఏలు, 23-24 జూన్, జనవరి రెండు డిఏలు మొత్తం నాలుగు డి ఏ బకాయిలు 3.64 శాతం చొప్పున 16.56 శాతం పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. తక్షణమే వాటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత కార్యవర్గ సభ్యులు మాట్లాడారు. లోకసభ ఎన్నికలకు ముందే డిఏలను , ఇంటీరియమ్ రిలీఫ్‌ను పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయాలని జిల్లా అధ్యక్షులు శాస్త్రుల దత్తాత్రేయరావు, జిల్లా అధ్యక్షులు కే. రామ్మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎస్.మదన్మోహన్, కోశాధికారి ఈవిఎల్ నారాయణ, లావు వీరయ్య డివిజన్ నాయకులు హనుమాన్లు, సాయిలు, రాధాకృష్ణ, భోజారావు, ప్రసాదరావు తదితరులు విజ్ఞప్తి చేశారు



మాట్లాడుతున్న రిటైర్డ్ ఉద్యోగులు

అధునాతన సౌకర్యాలతో ‘కిడ్స్ కేర్’

- కిడ్స్ కేర్ చిల్డ్రన్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ నగరంలో అధునాతనమైన సౌకర్యాలతో వైద్య సౌకర్యం కల్పించే దిశగా నగరంలో ఏర్పాటుచేసిన అతిపెద్ద కిడ్స్ కేర్ చిల్డ్రన్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఆదివారం నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్, నిజామాబాద్ అర్బన్ శాసనసభ సభ్యులు ధన్పాల్ సూర్యనారాయణ రిబ్బన్ కట్ చేసి జ్యోతి ప్రజలను చేసి ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రి యాజమాన్యం చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ రమేష్ పవర్, డాక్టర్ అనిత రమేష్ ముఖ్య అతిథులను శాలువా కప్పి, పూలే బోకేను అందించి సత్కరించారు. ఆస్పత్రిలోని సౌకర్యాలను వారికి వివరించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి యజమాని, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ రమేష్ పవర్ మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ లేనివిధంగా నిజామాబాద్ జిల్లా ప్రజలకు వైద్య చికిత్స అందించడానికి అధునాతనమైన పద్ధతులతో సూపర్ స్పెషాలిటీని ప్రత్యేకంగా చిన్నపిల్లల కొరకే నిర్మించామని అన్నారు. అంతే కాకుండా ఏ ఒక్కరూ వైద్యం కోసం చిన్న పిల్లలను మహానగరానికి తీసుకుపోకుండా ఉండేందుకు, నిజామాబాద్ లోనే చికిత్స అందించే విధంగా సౌకర్యాలన్నింటిని ఏర్పాటు చేశామన్నారు. నగరంలోని ప్రముఖ వైద్యులు, ప్రత్యేక వైద్య నిపుణులు, ప్రముఖ రాజకీయ నాయకులు ఆసుపత్రిని సందర్శించారు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



ఎంపీ, ఎమ్మెల్యేను సన్మానిస్తున్న వైద్యులు



రిబ్బన్ కటింగ్ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

టెన్త్, ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-సిరికొండ

టెన్త్ ఇంటర్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే లొంక రామస్వామికి మొక్కులు చెల్లించుకుంటానని కాంగ్రెస్ ప్రభుత్వం అధిక మెజారిటీతో గెలిచిందుకు ఆదివారం మండలం లొంక రామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అయన మాట్లాడుతూ కమిటీ సభ్యుల విన్నపం మేరకు ఆలయానికి త్రీ ఫేస్ కరెంటు త్వరలోనే అధికారులతో మాట్లాడి మంజూరు చేయిస్తానని హామీ నిచ్చారు. ఈనెల 28వ నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. క్రమశిక్షణ కూడిన విద్య విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని, సమాజాన్ని సన్మార్గంలో నడిపించుటకు ఉపయోగపడుతుందని అన్నారు. ఆత్మవిశ్వాసంతో పెంపొందించుకొని పరీక్షల పట్ల భయాన్ని తొలగించుకోవాలని, వార్షిక పరీక్షల్లో విజయం సాధించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆయన అన్నారు

తాను మంత్రిగా ఉన్నప్పుడు గోదావరి నుండి సారంగాపూర్ అక్కడి నుండి మంచిప్ప వరకు గ్రావిటీ ద్వారా నీటి సదుపాయాన్ని కల్పించ దానికి కృషి చేశానని అన్నారు టిఆర్ఎస్ ప్రభుత్వం తమ స్వార్థ ప్రయోజనాల కోసం పైప్ లైన్ వేసి రైతులకు నీరు లేకుండా చేశారని అన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉప అధ్యక్షులు తాహెర్ బిన్ హందన్, ఎర్రన్నమండల అధ్యక్షుడు బాకారం రవి, మైనారిటీ సెల్ అధ్యక్షులు ఆసిఫ్, రాజేందర్ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షులు దిగంబర్, దేగాం సంజీవ్, శోభన్, పరిపెల్లి గంగారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న పలువురు

నవతెలంగాణ - బోధన్

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయసంఘం క్యాలెండర్లను ఆదివారం రాష్ట్ర అధ్యక్షులు కొంగల వెంకట్ ఆవిష్కరించారు. ఆదివారం బోధన్ పట్టణ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సమస్యలపై, వారి హక్కుల సాధనకై తాను నిరంతరం కృషి చేస్తానని అన్నారు. అనంతరం క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో. జిల్లా అధ్యక్షులు కేశపురం రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, ఎంఈఓ నాగనాథ్, జిల్లా భాద్యులు సంగీతరావు, నాగయ్య, బోధన్ మండలం అధ్యక్షులు అబ్బయ్య, ప్రధాన కార్యదర్శి ప్రేంకుమార్, ఉపాధ్యక్షులు మైసయ్య (మహేష్), గంగాధర్, మారుతి, పీర్య నాయక్, మహేష్ , ప్రసాద్ పాల్గొన్నారు.

ఎల్లమ్మ పండగ బోనాలు



ఊరేగింపులో విన్యాసాలు

నవతెలంగాణ-సిరికొండ
సిరికొండ మండలంలోని పెద్దవాల్గోట్ గ్రామంలో ఆదివారం నాడు ఎల్లమ్మ పండగ ను ఘనంగా నిర్వహించిన గ్రామస్థులు, ఏరేగింపుగా పోచమ్మకు బోనాలు సమర్పించడం జరిగింది గ్రామస్థులు, యువకులు, అధిక సంఖ్యలో పాల్గొని, ప్రతి ఒక్కరు సుఖ సంతోషాలతో పాడి పంటలతో ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చెట్ల కొమ్మలు నరికివేత



చెట్ల కొమ్మలను కొడుతున్న దృశ్యం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్
నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో కరెంటు తీగలకు ఆనుకొని ఉన్న చెట్ల కొమ్మలను ఆదివారం రోజు నరికి వేసినట్లు లైన్మెన్ శశికాంత్ రెడ్డి తెలిపారు. ఈదురు గాలులకు చెట్ల కొమ్మలు కరెంటు తీగలకు తగలడంతో కరెంట్ అంతరాయం ఏర్పడుతుందని కరెంటు తీగలకు ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మలను నరికి వేసినట్లు ఆయన తెలిపారు. చెట్లు నరికివేత సమయంలో మూడు గంటల పాటు విద్యుత్ అంతరాయం ఏర్పడింది.

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు.. కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్‌లో పలువురి చేరిక

నవతెలంగాణ-భిక్కనూర్
బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు నరసింహారెడ్డి ఆదివారం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ సంక్షేమ శాఖ సలహాదారులు, మాజీ మంత్రి మహమ్మద్ షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలాగే సొసైటీ చైర్మన్ భూమయ్య, జంగంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ నర్సింలు యాదవ్ కాంగ్రెస్ పార్టీలో చేరడంతో పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు చంద్రకాంత్ రెడ్డి, మండల అధ్యక్షులు భీమ్‌రెడ్డి, ఎంపీపీ గాల్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదర్శన్, ఎన్నారై సెల్ జిల్లా కన్వీనర్ సుధాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఒక్కచోట చేరిన పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-లింగంపేట్
లింగంపేట్ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 1987-88 పదో తరగతి విద్యార్థులు పదో తరగతి బోధించిన ఉపాధ్యాయులను ఓపెన్ టాప్ జీప్‌లలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా వరకు ఊరేగింపు కొనసాగింది. అనంతరం పాఠశాల ప్రాంగణంలో ప్రధానోపాధ్యాయుల ఉపన్యాసము నిర్వహించారు. బాల్యం బంగారం జ్ఞాపకాలు మధురం ఇదే మన స్నేహం అనే నినాదంతో విద్యార్థులు ఉపాధ్యాయులకు శాలువలు కప్పింబొళ్ళు అందజేశారు. విద్యార్థి దశలో తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యార్థులకు మెమోంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమాలు నిర్వాకులు గంగాధర్, శ్రీనివాస్, షౌకత్, సాయికుమార్, సి శ్రీనివాస్, మల్లయ్య, స్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న అంజలి

నవతెలంగాణ-బోధన్
ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బందిగా నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ బోధన్ డివిజన్ ఇంఛార్జి అంజలి అన్నారు. ఆదివారం బోధన్ పీఆర్టీయూ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 28వ తేదీ నుండి మార్చి 19 వ తేదీ వరకు జరుగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలను ప్రభుత్వం సమర్థవంతంగా నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇంటర్ పరీక్షలలో మొదటి, రెండవ సంవత్సరాలకు సంబంధించి సుమారు వేలాదిమంది విద్యార్థులు హాజరవుతున్నారని, పరీక్ష కేంద్రాలలో మాస్ కాపీయింగ్ జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రం వద్ద సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు శివాజి , రోహిత్ , సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టి సెల్ అధ్యక్షుడికి సన్మానం



నవతెలంగాణ-గాంధారి
కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ యస్‌టిసెల్ అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన రాణా ప్రతాప్‌ను గాంధారి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కామెల్లి బాల్‌రాజ్, లైని రమేశ్, యండి మదార్, గొల్లాడి గణేష్, నీలరవి, సయ్యద్‌బషీర్, రవిరాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

వాతావరణంలో మార్పులు..

జొన్న పంట రైతుల ఆందోళన

- ఉమ్మడి మండలంలో 17 వందల ఎకరాల్లో జొన్న పంట సాగు



కోత దశలో ఉన్న జొన్న పంట

నవతెలంగాణ-మద్నూర్
వేసవికి ముందే ఎండలు ముదరగా.. ఆదివారం ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చింది. నేడు, రేపు పలు చోట్ల మోస్తారు నుంచి భారీ వర్షం వర్షం కురిసే అవకాశాలున్నట్లు వాతావరణశాఖ తెలిపింది. దీంతో మద్నూర్ ఉమ్మడి మండలంలో జొన్న పంట సాగుచేసే రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు తెలిపిన అంచనాల ప్రకారం జొన్న పంట సాగు మద్నూర్ ఉమ్మడి మండలంలో 17వందల ఎకరాలు ఉంటుందని సమాచారం. వాతావరణంలో రెండు రోజులుగా మార్పు కనిపించడం ఆదివారం వర్షాలు కురిసే జిల్లాల్లో భాగంగా నిజామాబాద్, కామారెడ్డి, జిల్లాలు ఉన్నందున చేతికి వచ్చిన జొన్న పంట అకాల వర్షం కురిస్తే భారీ నష్టానికి గురి అవుతుందని రైతులంతా ఆందోళన చెందుతున్నారు. ఆదివారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వర్షా సూచనలు ఉండటం అదేవిధంగా సోమవారం కూడా తెలంగాణ రాష్ట్రంలో పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్ర సూచనలు కనిపించాయి. జొన్న పంట కోతకు వచ్చింది. ఈ సమయంలో అకాల వర్షం పడితే జొన్న పంట నేలకొరగడమే కాకుండా నల్ల బడి పూర్తిగా నష్టం వాటిల్లుతుందని జొన్న పంట రైతులంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మారుతున్న రాజకీయ సమీకరణాలు

- బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో భారీగా చేరికలు



కాంగ్రెస్‌లో చేరిన పలువురు

నవతెలంగాణ-ఎడపల్లి
శాసనసభ ఎన్నికల కన్నా ముందు ఎడపల్లి మండలంలో బీఆర్ఎస్ పార్టీకి కంచుకోటలగా ఉండేది. 17 మంది సర్పంచ్‌లు, 11 మంది ఎంపీటీసీలు, ఒక జడ్పిటిసి, ఒక కోఆప్షన్ సభ్యులు ఉన్నారు. బీఆర్ఎస్ పార్టీ బలంగా ఉండేది. ఎడపల్లి జైతాపూర్ సహకార సంఘాల అధ్యక్షులు సైతం బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగారు.

బీఆర్ఎస్ పార్టీలో 11మంది ఎంపీటీసీలు తటస్థం...

17 మంది సర్పంచులలో కొంతమంది సర్పంచులు కాంగ్రెస్ పార్టీలో చేరిక. కాంగ్రెస్ అధికారంలోకి రావడం పట్ల బీఆర్ఎస్ పార్టీలో ఉన్న ప్రజాప్రతినిధులు తాజా మాజీ సర్పంచులు ఎంపీటీసీలు, అయోమయంలో ఉన్నారు. జెడ్పి ఉపాధ్యక్షురాలు రజిత ఎల్లయ్య యాదవ్ బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. తానా కలాన్, నెహ్రూ నగర్ సర్పంచ్‌ల అమానుల్లా షరీఫ్, కుర్నపల్లి గ్రామ తాజా మాజీ ఉపసర్పంచ్ మహేష్‌గౌడ్, బాపునగర్ సర్పంచ్ సునీత రవి, ఎమ్మెస్సీ ఫారం సర్పంచ్ కొక్కెన విజయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. మిగతా పదిమంది ఎంపీటీసీలో తోపాటు ఎంపీపీ కొండల శ్రీనివాస్ బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగే అవకాశాలు నిండుగా కనిపిస్తున్నాయి. బ్రాహ్మణపల్లి, పోచారం, సర్పంచులు బిజెపి పార్టీలో చేరారు. మండలంలో ఏకైక మహిళ రిజర్వేషన్ ధర్మారం గ్రామ పంచాయతీ సర్పంచ్ గోవూరి పూజరవి.. గెలుపొందినప్పటి నుంచి పదవి కాలం పూర్తయినప్పటి వరకు స్వతంత్ర అభ్యర్థిగా ఉండి, గ్రామపంచాయతీ కార్యదర్శి సంబంధిత మండల అధికారుల సలహాలు సూచనలతో, గ్రామ అభివృద్ధికి కృషి చేశారు. బీఆర్ఎస్ పార్టీ ప్రతిపక్షంలో ఉండడం పట్ల, ఆ పార్టీకి చెందిన ప్రస్తుత ప్రజా ప్రతినిధులు, తాజా మాజీ, సర్పంచులు ఏ పార్టీలో చేరితే తమ గ్రామం అభివృద్ధి చెందుతుందనే సమాలోచనలు ఉన్నట్లు సమాచారం. చాలామంది తాజా మాజీ సర్పంచ్‌లతో పాటు ప్రస్తుతం పదవిలో ఉన్న ప్రజాప్రతినిధులు సైతం ఏ పార్టీలో చేరాలనే అంశంపై వెనుకంజ వేస్తున్నట్లు తెలుస్తుంది.

క్రీడలు ఆడేందుకు ప్రోత్సహించాలి

- విద్యార్థుల తల్లిదండ్రులకు ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతరావు విజ్ఞప్తి



రిబ్బన్ కట్ చేసి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-పిట్లం
తల్లిదండ్రులు తమ పిల్లలకు క్రీడల పట్ల అవగాహన కలిగించాలని వారు క్రీడల్లో పాల్గొనేందుకు ప్రోత్సహించాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు అన్నారు. శనివారం సాయంత్రం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బొడ్ల రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎల్‌కెఆర్ షటిల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కాసేపు షటిల్ ఆడి క్రీడాకారులను ఉత్సవ పరిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువతకు క్రీడలు శారీరక ధృఢత్వము, మానసి కోలాసము కలిగిస్తాయని అందుకుగాను తల్లిదండ్రులు , ఉపాధ్యాయులు యువతకు క్రీడల పై ప్రోత్సహించాలని అన్నారు. ఈ రోజుల్లో టెక్నాలజీ పెరగడంతో పిల్లలు ఆన్‌లైన్ గేమ్స్, సోషల్ మీడియా యాప్‌లకు అలవాటు పడి వ్యసనాల వల్ల డబ్బులు కోల్పోతు తమ జీవితాలను దుర్భరం చేసుకుంటున్నారని గుర్తు చేశారు. షటిల్ టవర్నమెంట్ లో గెలుపొందిన ప్రథమ , ద్వితీయ , తృతీయ , చతుర్థి స్థానాలకు గాను 11,111 : 5, 555 : 3 ,333 : 2,222 రూపాయలతో పాటు మెమెంటోలు అందించనున్నట్లు తెలిపారు. పోటీలలో పాల్గొనేందుకు నియోజక వర్గ మండలాల్లో కాకుండా డివిజన్ , ఉమ్మడి జిల్లాల నుండి షటిల్ క్రీడాకారులు పాల్గొననున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రామ్ రెడ్డి , జంబిగే హన్మాండ్లు , మోహన్ రెడ్డి , కృష్టారెడ్డి, చిప్ప శివ తదితరులు పాల్గొన్నారు.

సద్గురు రోహిదాస్ మహారాజ్ జయంతి వేడుకలు

నవతెలంగాణ-మద్నూర్
మద్నూర్ మండల కేంద్రంలోని మోచి కాలనీలో ఆదివారం సద్గురు రోహిదాస్ మహారాజ్ 647 జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సద్గురు రోహిదాస్ మహారాజ్ చిత్రపటానికి మోచి కులస్తులు నివాళులర్పించారు. యువకులు మాట్లాడుతూ సద్గురు రోహిదాస్ మహారాజ్ అందించిన సేవల గురించి కొనియాడారు. జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు అన్న ప్రసాదం కార్యక్రమాలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో సంజీవ్, దిలీప్, జీవన్, రవి యువకులతో పాటు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జాతర బ్రహ్మోత్సవాలు పూర్తి



నవతెలంగాణ-ఎడపల్లి
మండలంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఈనెల 17న ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిసాయి. వారం రోజులుగా దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు ఆలయ కమిటీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. జాతర బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు కావడంతో భక్తులు అష్టముకి కోనేరులో స్నానాలు చేసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జానకంపేట గ్రామానికి చెందిన పురం అబ్బయ్య భక్తుల సౌకర్యం మేరకు అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. కుస్తీ పోటీలు అలరించాయి. ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.

విద్యాలయ అంతర్గత రోడ్ల నిర్మాణం చేపట్టండి



కలెక్టర్‌కు చిత్రపటం అందజేస్తున్న ఉపదాధఆయులు

నవతెలంగాణ-నిజాంసాగర్
జవహర్ నవోదయ విద్యాలయంలో అంతర్గత రోడ్ల నిర్మాణం చేపట్టాలని ప్రిన్సిపల్ సత్యవతి కలెక్టర్ జిఏతశ్ వి పాటిల్‌ను కోరారు. మండల కేంద్రంలోని జవహర్‌లాల్ నవోదయ విద్యాలయంలో మార్చి 15వ రోజు ఉదయం 10గంటలకు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధ్యక్షతన విద్యాలయ పాలక మండల సమావేశం నిర్వహించనుండగా.. ఉపాధ్యాయ బృందంతో శనివారం కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆమె విద్యాలయ అంతర్గత రోడ్ల నిర్మాణం గురించి, విద్యాలయ ప్రగతికి గురించి కలెక్టర్‌కి వివరించారు. అలాగే కలెక్టర్‌కి ఆర్ట్ ఉపాధ్యాయులు సయ్యద్ జియావుద్దీన్ గీసిన చిత్రపటాన్ని, తెలుగు అధ్యాపకులు డాక్టర్ ఎస్.శ్యామ్‌ప్రసద్ రచించిన సాహిత్య ప్రభలు అనే గ్రంధాన్ని కలెక్టర్‌కి ఆమె అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డీ.ప్రభాకర్, ఏ.కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో క్లబ్ బలోపేతం



రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైకిళ్లు అందజేత

నవతెలంగాణ-కామారెడ్డి
కామారెడ్డి రోటరీ క్లబ్ లో 49వ వార్షికోత్సవాన్ని రోటరీ ఆడిటోరియంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా గతం లో పనిచేసిన అధ్యక్షులను, ప్రస్తుత క్లబ్ అధ్యక్ష,కార్యదర్శులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ అధ్యక్షులు తమ అనుభవాలను పంచుకున్నారు. క్లబ్ అధ్యక్షులు పోలబోయిన సత్యం మాట్లాడుతూ గతంలో పనిచేసిన అధ్యక్షులు తమ శక్తివంచన లేకుండా సామాజిక కార్యక్రమాల్లో సేవలు చేసినందుకు క్లబ్ స్థిరంగా పటిష్ఠంగా ఉందని భవిష్యత్తులో చక్కటి సామాజిక కార్యక్రమాలు చేస్తూ క్లబ్ ను బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.

తదనంతరం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో, రోటరీ క్లబ్ హైదరాబాద్ నార్త్ వారి సహకారంతో, వెల్జెన్ వారి ఆర్థిక సహకారంతో, వివిధ పాఠశాలల్లో చదువుతున్న ఐదుగురు విద్యార్థినులకు ఉచితంగా సైకిల్లను అందజేశారు. విద్యార్థులు భవిష్యత్తులో మంచి చదువులు చదువుకొని భవిష్యత్తులో స్థిరపడి తాము మంచి స్థితిలో ఉంటూ సమాజానికి సేవ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి రాజనర్సింహారెడ్డి, క్లబ్ ప్రతినిధులు శ్రీశైలం, నంగునూరు కాశీనాథం, ధనంజయ, డాక్టర్ విజయకుమార్, డాక్టర్ బాలరాజు, చంద్రశేఖర్, వెంకటరమణ, కృష్ణమూర్తి, కాశీనాథ్ రావు, పనాస అంజయ్య, హరిస్మరణ్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు పరిశీలన

నవతెలంగాణ-మద్నూర్
మద్నూర్ మండలంలోని మేనూర్ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా ఐదు లక్షలు మంజూరు కావడంతో మేనూర్ గ్రామంలో స్మశానవాటిక వెళ్లే మార్గం లో సిసి రోడ్డు నిర్మాణ పనులు వేగవతంగా కొనసాగుతున్నాయని స్థానిక నాయకులు తెలిపారు. ఆదివారం పనులు పరిశీలించారు. గత కొన్ని సంవత్సరాల నుండి శ్మశాన వాటికకు రోడ్డు లేక పోవడం తో వర్ష కాలం లో గ్రామస్తులు ఎవరైనా మరణిస్తే ఎంతో ఇబ్బంది పడుతూ మృతదేహాన్ని తీసుకువెళ్లె వారని మేనూర్ గ్రామ సమస్య ని తెలుసుకుని వెంటనే నిధులు మజూరు చేసి పనులు కొనసాగేలా కృషి చేసిన జుక్కల్ నియోజక వర్గా ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్‌కి మేనూర్ గ్రామస్తుల తరుపున ప్రత్యేక కృతజ్ఞతాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ మిరాజ్, సంతోష్ , సిరాజ్ ,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



పలు స్కూళ్లల్లో ఇంకా కట్టెల పొయ్యే..

- బిల్లులు పెండింగ్‌తో గ్యాస్ భారం



పాఠశాలలో కట్టెల పొయిపైన వండుతున్న దృశ్యం

నవతెలంగాణ-జుక్కల్
ప్రభుత్వ పాఠశాలల్లో నేటికి కట్టెల పొయ్యి మీదనే మధ్యాహ్న భోజనం వండాల్సిన పరిస్థితిలు నెలకొన్నాయి. పలు పాఠశాలలను పరిశీలించగా.. వంట ఏజెన్సీ వారికి కదిలించగా పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి. గత ఆరుమాసాలుగా వంటదినుసల బిల్లులు రావడం లేదని, జీతాలు మాత్రమే ఇస్తున్నారని, గ్యాస్ బండ ఇచ్చారు , నింపెందుకు డబ్బులు ఇవ్వక పోవడంతో మూలకు పడ్డట్టు తెలిపారు. ఇప్పటికే కిరాణ దుకాణం దారులకు, గుడ్లు ఇచ్చేవారికి వేలలో బాకీలు పడ్డామని, వారికి ఇచ్చే డబ్బులకు వడ్డీలు వేసి కట్టవల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వం నుండి నెల నెల డబ్బులు ఇవ్వక పోవడంతో బంగారం కుదవ పెట్టి కిరాణ షాప్ వారికి కడుతున్నామని, పిల్లలు ఉపవాసం ఉండవద్దనే ఉద్దేశంతో ఉపాధ్యాయులు బతిమాలుతున్నట్లు తెలిపారు. వంటచేయడం మానేయవద్దని మమ్మలిని ప్రాదేయపడుతుంటే కొనసాగిస్తున్నామని, ప్రభుత్వం ప్రతినెలా వారిగా తమ బిల్లులు చెల్లిస్తే అన్ని సక్రమంగా అందే అవకాశం ఉంటుందని వివరిస్తున్నారు.

నాల్గవ రోజు బ్రహ్మోత్సవాలు



నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని మామిడిపల్లి గ్రామ శివారులో గల అపురూప వెంకటేశ్వర ఆలయంలో సప్తాహ్నిక పుష్కర బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు బ్రహ్మోత్సవాలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్పర్సన్ అమృత లత, కమిటీ సభ్యులు, రమాదేవి, అర్చకులు, ప్రజలు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 'పూర్వవిద్యార్థులు' ఆదివారం సమ్మేళన కార్యక్రమం' ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా 1986-87 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులు అందరూ ఒక్కచోట కలిసి అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. పరిచయం చేసుకుంటూ ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆనాటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో అప్పటి విద్యార్థులు ముస్కు భూమేశ్వర్, శ్రవణ్ కుమార్, రాజేష్, పెంటు గంగాధర్, త్రిభువన్, గాదె గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని యువకుడు మృతి

నవతెలంగాణ-ఏర్గట్ల

మండల కేంద్రంలో శనివారం రాత్రి విషాదకరమైన ఘటన చోటు చేసుకుంది. ఏర్గట్లకు చెందిన దండెవోయిన సతీష్ అనే యువకుడికి బైక్ ఢీకొనడంతో మృతిచెందాడు. ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఏర్గట్లకు చెందిన దండేవోయిన సతీష్ అనే యువకుడు ఆయన స్నేహితులతో కలిసి ఊరు చివరన అయ్యప్పస్వామి ఆలయ సమీపంలో నడుచుకుంటూ...వెళ్ళగా అదే గ్రామానికి చెందిన గుర్రపు అజయ్ అనే యువకుడు శనివారం రాత్రి అతివేగంగా, అజాగ్రత్తగా ద్విచక్ర వాహనం నడపుకుంటూ ఢీకొంది. చికిత్స కోసం మెట్ పల్లి ఆసుపత్రికి తీసుకెళ్ళగా అక్కడ యువకుడు మృతిచెందాడు. మృతుడు సతీష్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

బారికేడ్లను తొలగించండి

- వాహనదారులకు సౌకర్యం కల్పించండి



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నగరంలోని వినాయక్ నగర్ ప్రాంతంలో వినాయకుల బావి వద్ద డివైడర్‌ని నిర్మించే సమయంలోనే వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు డివైడర్ మధ్యలో వాహనాలు రాకపోకలకు స్థలాన్ని కేటాయించారు. ఇప్పుడు ఆ రహదారిలో డివైడర్ మధ్యలో ఉన్న ఖాళీ స్థలాన్ని బారీకేడ్లతో మూసివేశారు. అందువల్ల వినాయకుల బావి రోడ్డులో ప్రయాణించే వాహనదారులు, ఇతర ప్రాంతాల నుండి వచ్చె వాహనదారులు వినాయకుల బావి వైపు వెళ్లడానికి ఇబ్బందులకు గురి అవుతున్నామని అంటున్నారు. అధికారులు గమనించి గతంలో రోడ్డు నిర్మించే సమయంలోనే ఖాళీ స్థలంతో డివైడర్లను నిర్మించడం జరిగింది. బారికేడ్లు తొలగించి వాహనదారులకు సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

ఎల్‌హెచ్‌పిఎస్ జిల్లా యువజన అధ్యక్షులుగా లౌడియా మహిపాల్ నాయక్



నవతెలంగాణ-డిచ్‌పల్లి

లంబాడి హక్కుల పోరాట సమితి ఎల్‌హెచ్‌పిఎస్ నిజామాబాద్ జిల్లా యువజన (యూత్)అధ్యక్షునిగా ఇందల్‌వాయి మండలంలోని గుట్ట కింది తాండవాసి లౌడియా మహిపాల్ నాయక్‌కు నియామక పత్రం అందజేశారు. లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు బెల్లయ్య నాయక్ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు చౌహాన్ మోహన్ నాయక్ నియామక పత్రాన్ని అందజేసినట్టు లౌడియా మహిపాల్ నాయక్ తెలిపారు. ఆదివారం ఇందల్‌వాయి మండల కేంద్రంలో గిరిజన యువకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లౌడియా మహిపాల్ నాయక్ మాట్లాడుతూ.. త్వరలోనే జిల్లాలోని అన్ని మండలాలకు మండల కార్యవర్గాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గిరిజన యువత ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకొని వస్తానని అన్నారు.

చంద్రాయన్‌పల్లిలో వీరబ్రహ్మేంద్ర స్వామి 29వ వార్షికోత్సవం



నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి మండలంలోని చంద్రాయన్ పల్లి గ్రామంలో వీరబ్రహ్మేంద్ర స్వామి 29వ వార్షికోత్సవం సందర్భంగా కళ్యాణం, హెూమం, కుంకుమ అర్చన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనసూయమ్మ, కీర్తిశేషులు గంగాధర్ పంతులు కుమారులైన శ్రీనివాసులు రాజేశ్వర్, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, శిష్యులు భక్తుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పద్మశాలి వధూవరుల పరిచయ వేదికను సద్వినియోగం చేసుకోవాలి



కరపత్రాన్ని అందజేస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మార్చి 31న నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో నిర్వహించనున్న పద్మశాలి వధూవరుల పరిచయ వేదికను పద్మశాలి యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని పద్మశాలి సంఘం నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు భోగ అశోక్, నిజామాబాద్ వధూవరుల పరిచయ వేదిక సంఘం ఉపాధ్యక్షులు గాలేపల్లి నారాయణ కోరారు. ఆదివారం మండలకేంద్రంలో పలువురు పద్మశాలి ప్రముఖులకు 6వ పద్మశాలి వధూవరుల పరిచయక వేదిక సంఘం నిజామాబాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పద్మశాలి వధూవరుల పరిచయ వేదిక కరపత్రాలను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మార్చి 31న జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో వధూవరుల పరిచయ వేదిక కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. పద్మశాలి కులస్తుల, బంధుమిత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొని వధూవరుల పరిచయ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎలాంటి ఎంట్రీ ఫీజు లేదని, భోజన వసతి సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు అన్నం గణపతి రాం, బొడ్డు శంకర్, పోతు ధరణి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అన్నికులాలకు కమ్యూనిటీ హాల్స్ మంజూరుచేశా

- నాయకులు, కార్యకర్తలకు ఇబ్బంది కలిగిస్తే ఊరుకోను
- మాజీ స్పీకర్, ఏమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- రెడ్డి సంఘ భవనం పారంభించిన పోచారం

నవతెలంగాణ-వర్ని(మోస్రా)

మండలకేంద్రంలో నూతనంగా నిర్మించినరెడ్డి సంఘం కళ్యాణ మండపాన్ని ఆదివారం మాజీ శాసనసభ సభాపతి, మాజీ మంత్రి, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి పారంభించారు. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఏగ్రామానికి.. వర్గానికి తక్కువ చేయలేదని అడిగిన వారందరికీ కమ్యునిటి హాల్స్ మంజూరు చేశానని అన్నారు. రూ.150 కోట్లతో నియోజకవర్గంలోని అన్ని కులాలు, వర్గాల వారికి 4,000 కమ్యునిటి హాల్స్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయటం జరిగిందని తెలిపారు. పేదలకు తక్కువ ఖర్చుతో ఫంక్షన్లు చేసుకోవడానికి నియోజకవర్గంలో 120 కళ్యాణ మండపాలు నిర్మించామని అన్నారు. ప్రజల కోరిక మేరకు మోస్రాను నూతన మండలంగా ఏర్పాటుచేసి వసతులు కలిపించానని తెలిపారు. రూ. 7.50 కోట్లతో మోస్రా మండల కేంద్రంలోని ప్రధాన రహదారిని డివైడర్, సెంట్రల్ లైటింగ్‌తో నాలుగు వరసలుగా విస్తరించామని తెలిపారు. గత పదేళ్ళలో నియోజకవర్గంలోని అన్నిరంగాలకు పుష్కలంగా నిధులు తెచ్చి అభివృద్ధి చేశానని పేర్కొన్నారు. పదవులు, వస్తాయి.. పోతాయి.. అధికారం వస్తుంది.. పోతుంది.. కానీ పేదలకు చేసిన సేవలు మాత్రమే మిగులుతాయని హితవు పలికారు. తన రాజకీయ జీవితంలో ఇరవైఏళ్ళు అధికారంలో ఉన్నా ఎవ్వరికీ అన్యాయం చేయలేదని, కొంతమంది స్వార్థ నాయకులు ఇతర పార్టీల వైపు పోతున్నారని అన్నారు. పోయే వాళ్ళు పోతారు.. పొల్లు పోతుంది, గట్టి మిగులుతుందని తెలిపారు. నాకు అండగా ఉన్న వాళ్ళు చాలని, కడుపున పెట్టుకుని కాపాడుకుంటున్న వారందరిని నేను కూడా కాపాడుతానని అన్నారు. ఎవరికి ఏ అవసరం వచ్చిన, బాధ కలిగినా ఎల్లప్పుడూ మీకు అందుబాటులో ఉంటానని అన్నారు. .అధికార పార్టీ నాయకుల ప్రోద్బలంతో ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ఎవరైనా నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బంది కలిగించినా ఊరుకోనని హెచ్చరించారు. కార్యాలయాలు, ఇళ్ళ ముందు ధర్నా చేస్తానని, కార్యకర్తలకు న్యాయం జరిగే వరకు వదిలిపెట్టనని అన్నారు. మంచి రోజులు వస్తాయని కార్యకర్తలకు ధీమా ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీ ఛైర్మన్ దాదాన్న విఠల్ రావు, జడ్పీటీసీ విజయ భాస్కర్ రెడ్డి, ఎంపీపీ పిట్ల ఉమా శ్రీరాములు, డిసిసిబి ఛైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి నియోజకవర్గం ఇంచార్జి పోచారం సరెండర్ రెడ్డి, మండల అధ్యక్షులు హన్మత్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు సుమలత రాంరెడ్డి గోవూర్ నరేందర్ రెడ్డి, విమల లింగయ్య, సున్నం భూమయ్య, వైస్ ఎంపీపీ శంకర్, పి ఏ సి ఎస్ ఛైర్మన్ సుధాకర్ రెడ్డి కార్యకర్తలు, నాయకులు, పాల్గొన్నారు.



రిబ్బన్ కటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

మత్స్యకారుల ప్రాణరక్షణకు చర్యలు తీసుకోండి

- మత్స్యకారులు

నవ తెలంగాణ-బాల్కొండ

రాష్ట్రంలోని భారీ ప్రాజెక్టుల్లో ఒకటైన శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ రిజర్వాయర్లో చేపలు పడుతున్న మత్స్యకారుల ప్రాణ రక్షణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని బాల్కొండ మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు బట్టు ప్రవీణ్, సెక్రటరీ ఉట్నూర్ గణేష్ ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా వాళ్ళు మాట్లాడుతూ.. ప్రాణ రక్షణకు అవగాహన సదస్సులు, మెళకువలు, ట్రైనింగ్లు నిర్వహిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ప్రాణాలు కాపాడుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరైన పరికరాలు ఇవ్వకపోవడంతో మత్స్యకారులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజుల వ్యవధిలోనే రిజర్వాయర్లో చేపల వేటకు వెళ్లి ముగ్గురు మత్సకారులు ప్రాణాలు కోల్పోయారన్నారు. మృత్యువాత పడ్డ మత్స్యకారుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని అన్నారు. చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ప్రస్తుతం ఇస్తున్న ఎక్స్‌గ్రేషియా 5 లక్షల నుండి 20 లక్షల వరకు పెంచాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మత్స్యకారులకు ప్రాణ రక్షణకై లైఫ్ జాకెట్స్, బోట్లు అవసరమయ్యే సామాగ్రిని తొందరగా అందజేయా లని వారు కోరారు.



మాట్లాడుతున్న మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు ప్రవీణ్

శ్రీ ఆనంద గిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూర్ణాహుతి చక్రతీర్థం



హోమం నిర్వహిస్తున్న పండితులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

జక్రాన్‌పల్లి మండలంలోని కొలిప్యాక్ గ్రామంలో శ్రీ ఆనందగిరి లక్ష్మీ నృసింహా స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం పూర్ణహుతి చక్రతీర్థం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు దండాల మోహన్ శర్మ, ఆలయ కమిటీ ఛైర్మన్ ప్రశాంత్, వైస్ ఛైర్మన్ గడ్డం ముత్తెన్న, మాజీ సర్పంచ్ ఆత్మకూరు గంగు బాలయ్య, మాజీ ఎంపీపీ ధీకొండ హరిత శ్రీనివాస్, దీకొండ కిరణ్, బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా వారియర్ తెలంగాణ జాగృతి అధ్యక్షులు అజయ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా సిఓఈ సెట్ - 2024 పరీక్షలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల ప్రతిభా కళాశాల (సిఈఓ), ధర్మారం-బిలో టిఎస్‌డబ్ల్యూఆర్, సిఓఈ సెట్ - 2024లో అర్హత సాదించిన విద్యార్థులకు టిఎస్‌డబ్ల్యూఆర్ సిఓఈ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ల కొరకు) ప్రవేశ పరీక్షను ఆదివారం నిర్వహించారు. ఈ పరీక్ష కేంద్రంలో మొత్తం 329 మంది విద్యార్థిని, విద్యార్థులను అలాట్ చేయగ 312 (95శాతం) మంది హాజరుకాగా 17 మంది హాజరు కాలేదని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ బి. సంగీత తెలిపారు. నిజామాబాద్ జిల్లా మొత్తంలో (2) పరీక్షా కెం దాలలో ఈ పరీక్ష నిర్వహించగ మొత్తం 657 మంది విద్యార్థులకు గాను 637 (96శాతం) మంది ఈ పరీక్షకు హాజరు కాగా 27 (4శాతం) మంది గైర్హాజరయ్యారని వివరించారు. పరీక్ష సజావుగా నిర్వహించడానికి బోర్లం ప్రిన్సిపాల్ ఎం పద్మకుమారి, ఎల్లారెడ్డి ప్రిన్సిపాల్ కె కృష్ణ మూర్తిని ప్రత్యేక అబ్జర్వర్స్‌లను నియమించినట్టు తెలిపారు. వారు ఈ పరీక్షా కేంద్రంనకు సందర్శించి పరీక్షా నిర్వహణను పరిశీలించినట్లు పేర్కొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-డిచ్‌పల్లి



ఇందల్ వాయి మండలంలోని ఇందల్ వాయి గ్రామంలో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి 5 లక్షల రూపాయలు మంజూరు కాగా ఆ పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోత్కురి నవీన్ గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నాయకులు పూజ్యం రవికుమార్, కాంగ్రెస్ గ్రామ శాఖ అణ్యక్షుడు సయెందర్, ముడెగమా శ్రీనివాస్ రెడ్డి, విడిసి చైర్మన్ మోహన్, గట్టు కాడారీ, మాజీ సర్పంచ్ దశరథ్,చిన్న గంగారాం, భైరీ రవి

విహార యాత్రకు హోవర్డ్స్ విద్యార్థులు



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

హోవర్డ్ స్కూల్ విద్యార్థులను విహార యాత్రకు ఆ ర్మూర్‌లో గల 'క్రేజీ ల్యాండ్స్' కి శనివారం తీసుకెళ్లారు. వి ద్యార్థులు అక్కడ ఉన్న ఆట వస్తువులతో ఆనందంగా ఉత్సాహంగా ఆడుకున్నారని హోవర్డ్ పాఠశాల ప్రిన్సిపల్ తెలిపారు.

ఘనంగా పదివిద్యార్థులకు వీడ్కోలు



నృత్యం చేస్తున్న విద్యార్థినిలు

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని కృష్ణవేణి హై స్కూల్ ఆధ్వర్యంలో శనివారం ఫ్యూషన్ 2024 ఫేర్వెల్ బేస్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పరీక్షలు సమీపిస్తుండడంతో విద్యార్థుల కార్యాచరణ గురించి ఉపాధ్యాయులు పలు సూచనలు చేశారు. పదవ తరగతి విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ భానుచందర్, ఎ. లక్ష్మణ్, విఘ్నేష్, ప్రిన్సిపాల్ విజయ్ కర్థాన్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సభ్యుల సేవకు అవార్డులు

నవతెలంగాణ-వర్ని

లయన్స్ 320 డి జిల్లాలోని రీజన్-2లో విఠల్ బ్రిలియన్స్ రీజనల్ ఛైర్మన్ శివ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని వీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో రీజనల్ కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబురావు హాజరైయ్యారు. ఈ సందర్భంగా రీజన్‌లోని 14 క్లబ్బులో జరిగిన సేవా కార్యక్రమాలను గుర్తిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహించిన సభ్యులందరికీ గుర్తింపుగా జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ప్రస్తుత గవర్నర్ వేమూరి లక్ష్మి మాజీ జిల్లా గవర్నర్ జనార్ధన్ రెడ్డి, పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి జిల్లాలోని రీజినల్ ఛైర్మన్లు, జోన్ ఛైర్మన్లు, 320డి లయన్స్ ప్రతినిధులు హాజరయ్యారు.



స్వర్ణోత్సవ ముగింపు సభను జయప్రదం చేయండి

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ స్వర్ణోత్సవ ముగింపు సభను జయప్రదం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.సూర్యశివాజీ పిలుపునిచ్చారు. పట్టణ కేంద్రంలో పెర్కిట్ ఆదివారంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 27న భైంసా పట్టణం లో ముగింపు సభ ఉంటుందని వారన్నారు. 1972 డిసెంబర్ 10న ఏర్పడిన బీడీ వర్కర్స్ యూనియన్, బీడీ ప్యాకర్ల నెలసరి వేతన, ఉద్యోగస్తులు, కార్మికుల కొరకు అనేక పోరాటాలు చేసిందన్నారు. పిఎఫ్, గ్రాట్యూటి బోనస్, ఈఎస్ఐతో పాటు కూలి వేతనల కొరకు అనేక పోరాటాలుచేసి సాధించిందని అన్నారు. కార్మికులకు చట్టానికి, మినీ సిగరెట్ల వ్యతిరేకంగా డేంజర్ బొమ్మ గుర్తుకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేసిన చరిత్ర యూనియన్ కు ఉందని వారు అన్నారు. పోరాటాలు చేసి జీవనభృతి సాధించిందన్నారు. పొగాకు వల్ల ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటుయ్యన్న సాకుతో బీడి పరిశ్రమ పూర్తి నిర్వీర్యం చేయటానికి కోప్టా చట్టాన్ని తేవటానికి పార్లమెంట్లో బిల్లు రూపంలో కాచుకొని కూర్చున్నదని తెలిపారు. ఇది అమలైతే బీడీ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న కోటి 70 లక్షల మంది కార్మికుల బతుకులు ఆగమ్య గోచరంగా మారే ప్రమాదం ఏర్పడుతుందని అన్నారు. బీడీ కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు చూపెట్టాలి లేదా రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నట్లు అంక్షలు లేని జీవన భృతి నెలకు పదివేల రూపాయల ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం బీడీ పరిశ్రమ పై విధించిన జీఎస్టీని ఎత్తివేయాలని బీడీ పరిశ్రమ నుండి కోట్పా చట్టాన్ని మినహాయించాలని డిమాండ్ చేశారు. రాజీనామా చేసిన కార్మికులకు ప్రతినెల పదివేల రూపాయల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. భైంసా పట్టణంలో గల కే.ఎస్ గార్డెన్‌లో సభ ఉంటుందని, బీడీ కార్మికులు పాల్గొని విజయవంతం చెయ్యాలని కార్మికులకు పిలుపునిచ్చారు. సమావేశంలో కే. పుష్ప, ఎం. పద్మ, ఎస్. రేణుక, కె.విమల, కె.కావ్య, కమల తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూర్యశివాజీ

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
సోమవారం | ఫిబ్రవరి 26, 2024 | www.navatelangana.com

ప్రశాంతంగా సిఓఈ సెట్-2024 ప్రవేశపరీక్ష

నవతెలంగాణ-డిచ్‌పల్లి

సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నడుస్తున్న ప్రతిభ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రతిభా కళాశాలల్లో మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ లో ప్రవేశానికి గాను సిఓఈ సెట్-2024 రెండో దశ ప్రవేశపరీక్ష ను ప్రశాంతంగా నిర్వహించినట్లు సంస్థ నిజామాబాద్ ఆర్ సి వో కే అలివేలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష నిజామాబాద్ రీజియన్ పరిదిలో 4 కేంద్రాలలో నిర్వహించారని, నిజామాబాద్ జిల్లాలో 02, కామారెడ్డి జిల్లాలో 01, నిర్మల్ జిల్లాలో 01 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నిజామాబాద్ రీజియన్ పరిధిలో 1542 మంది అర్హత సాధించగా, వారిలో 1483 మంది పరీక్షకు హాజరయ్యారని తెలిపారు.

'రైతుల పట్ల నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు'

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఉపేక్షిస్తే సహించేది లేదని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రైతులకు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. అధికారంలో లేనప్పుడు కాంగ్రెస్ నాయకులు రైతుల పట్ల మాట్లాడి అధికారం రాగానే పట్టించుకోకపోవడం నిర్లక్ష్యపు పాలనకు నిదర్శనం అన్నారు. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ జన్మదిన కానుకగా రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండు నెలలు దాటుతున్న దాని ఊసే లేదన్నారు. జిల్లాలో లక్ష 64 వేల 124 రైతులకు రైతుబంధు కింద రూ.286కోట్లు అవసరమైతే, ఇప్పటివరకు 94 వేల 741 మందికి రూ.97 కోట్ల 16వేలు మాత్రమే వేశారన్నారు. సోయా 70 నుంచి 80 దాకా విక్రయించిన తర్వాత మార్క్ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని ఎద్దేవా చేశారు. శనగ, కంది పంటలు రైతుల చేతికి వచ్చిందని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విజ్జగిరి నారాయణ, కుమ్ర రాజు, వేణుగంటి ప్రకాష్, నాయకులు ఆనంద్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

కార్మికుల హక్కులకై సీఐటీయూ రాజీలేని పోరు

సీఐటీయూలో చేరిన ఆటో కార్మికులు

నవతెలంగాణ-వర్ని



నూతన కార్యవర్గాన్ని సన్మానించి సంఘ సభ్యులు

సిఐటియు కార్మిక, కర్షకుల పక్షాన చేస్తున్న పోరాటాలకు, వారి పక్షాన ఉంటూ కార్మికులకు అండగా ఉండటంతో రుద్రూర్ ఆటో యూనియన్ కార్మికులు ఆకర్షితులై జిల్లా ప్రధాన కార్యదర్శి నుర్జహన్, గంగాధర్ అప్ప ఆధ్వర్యంలో ఆదివారం సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహన్ మాట్లాడుతూ నిరంతరం కార్మికుల సమస్యలపై సిఐటియు రాజీలేని పోరాటం చేయడం ద్వారా ఆటో కార్మికులు ఆకర్షించి సిఐటియులో చేరడం జరిగిందన్నారు. హిట్, రన్ (బిఎన్ఎన్) 106 (1) (2) సెక్షన్ను రద్దు చేయాలని, ఎం.వి. యాక్ట్ 2019 సవరణ చట్టం రాష్ట్రంలో అమలు చెయ్యొద్దని అన్నారు. సవరణను ఉపసంహరించుకునే విధంగా కేంద్రం మీద ఒత్తిడి చేయాలని అన్నారు. కేరళ తరహాలో తెలంగాణ ప్రభుత్వం కూడా ఆర్థిక భారం లేకుండానే చేయవచ్చని తెలిపారు. రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆటో, క్యాబ్, గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్, బస్సు తదితర అన్నిరకాల ప్రైవేట్ ట్రాన్స్పోర్ట్ కార్మికులకు వర్తింపజేయాలని అన్నారు. ఇన్కమ్ ట్యాక్స్ పరిధిలో లేని అసంఘటితరంగ కార్మికులకు రూ.7,500లు నెలకు జీవన భృతి చెల్లించాలని డిమాండ్ చేసారు. మహిళలకు ఉచిత ఫ్రీ బస్ ద్వారా నష్టపోతున్న ఆటో డ్రైవర్లకు గీత, నేత, బీడీ కార్మికులకు ఇస్తున్నట్లుగా వీరికి జీవన భృతి నెలకు రూ.4,500 ఇవ్వాలన్నారు. మూడు నెలల పాటు ఆటోల మీద ఈఎంఐపై మారిటోరియం ప్రకటించాలని తెలిపారు. ఆటో డ్రైవర్ల ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ ప్రభుత్వమే భరించాలని, ప్రమాద బీమా రూ.5 లక్షలు, ఆరోగ్యశ్రీ ద్వారా రూ. 10 లక్షల ఉచిత వైద్యం మొత్తం రవాణారంగ కార్మికులకు వర్తింపజేయాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమస్యలను పరిష్కారం చేయకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎండి రఫీక్ జలీల్ వినోద్, సద్దాం లతీఫ్ శివ సతీష్ ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీని మోసం చేస్తే కన్నతల్లికి మోసం చేసినట్లే

బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల ఆగ్రహం
పార్టీ నుంచి ఎంపిపి బహిష్కరణ


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-వర్ని

పదేళ్ల బీఆర్ఎస్ పార్టీలో ఉండి ఐదేళ్ల ఎంపీపీ పదవిలో కొనసాగి నమ్మిన పార్టీకి మోసం చేసిన ఎంపీపీ మేక శ్రీలక్ష్మి వీర్రాజ్‌లను బహిష్కరించినట్లు డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి తెలిపారని వర్ని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. నమ్మిన పార్టీ ఒక తల్లి లాంటింది అని అదే తల్లికి వెన్నుపోటు పొడిచిన వారు పార్టీకి పనికి రారని మండల అధ్యక్షులు గిరి, కార్యదర్శి గోపాల్ విలేకరుల ఆదివారం మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో జడ్పిటిసి హరిదాసు, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు సింగంపల్లి గంగారం, వైస్ ఎంపీపీ బాలరాజ్, ఎంపీటీసీ ఎండుగుల సాయిలు, ఫ్యాక్స్ చైర్మన్ నామాల సాయిబాబా, కనకా రెడ్డి, కో ఆప్షన్ కరీం, కృష్ణారెడ్డి, మాజీ సర్పంచులు శ్రీనగర్ రాజు, హిర్సింగ్ మైసన్ వెంకటి, గణేష్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కేసు నమోదు

నవతెలంగాణ-డిచ్‌పల్లి


ప్రమాదస్థలంలో మృతదేహం

ఇందల్ వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి 44 దేవి తండా వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి ద్విచక్ర వాహనం ఢీ కొన్న తర్వాత లారీ పైనుండి వెళ్ళడంతో అక్కడి కక్కేడే మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన కందకూరి కుమార చారి(46) తన ద్విచక్ర వాహనం పై నిజామాబాదులో ఉంటున్న భావ వద్దకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. రాంగ్ రూట్ నుండి ఎదురుగా వస్తున్న మరొక ద్విచక్ర వాహనం ఢీ కొట్టడంతో కుమార చారి కింద పడ్డాడు. అదే సమయంలో వెనుక నుండి వస్తున్న ఒక లారీ పై నుంచి వెళ్లడంతో అక్కడికక్కేడే మతి చెందాడు. ఈ ప్రమాదం లో మతుడి తల నుజ్జునుజ్జు అయ్యింది. మతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణమైన ద్విచక్ర వాహనం, లారీ ను స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మార్చురీకి తరలించినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-సిరికొండ

1997-1998 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం మండలంలోని పెద్ద వాల్గొట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకొని ఒకరినొకరు ప్రేమపూర్వకంగా పలకరించుకున్నారు. చిన్ననాటి అల్లర్లను గుర్తు చేసుకుని సరదాగా రోజంతా గడిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, శంకరయ్య భాగేందర్, గంగాధర్, రామారావు, శారద, విద్యార్థిని విద్యార్థులు, రుమాండ్ల శ్రీనివాస్, నర్సయ్య, రమేష్, గంగ ప్రసాద్, మన్సుర్, సంతోష్, జగన్, తదితరులు పాల్గొన్నారు

ఆత్మీయ సమ్మేళనాలతో.. బంధాలు బలోపేతం

నవతెలంగాణ-నిజామాబాద్



ఎన్నికైన నూతన కార్యవర్గం

నిజామాబాద్ నగరంలోని వినాయక్ నగర్‌లో వంద ఫీట్ల రోడ్ లోని ఎల్లమ్మ ఆలయం వద్ద ఉన్న పంచముఖి మున్నూరు కాపు సంఘం భవనంలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం, మున్నూరు కాపుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 90 మంది సభ్యుల పరిచయ కార్యక్రమాన్ని అధ్యక్షులు, కార్యదర్శి, కోశాధికారి, నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటి యజమానికి కండువా కప్పి కుటుంబ సభ్యుల వివరాలు ఒకరికొకరు పంచుకున్నారు. ఓవర్ వెయిట్ క్యాటగిరి లో ఎస్ జీ ఎఫ్ తైక్వాండోలో స్టేట్ ఛాంపియన్ షిప్ లో గోల్డ్ మెడల్ సాధించి, జాతీయ స్థాయికి ఎంపికైన వైసాక్షి సంతోష్ కుమార్తె అక్షరను ఈ సందర్భంగా సన్మానించారు. అనంతరం నూతన కార్యవర్గం అధ్యక్షులుగా హరిదాసు సాయిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కులాచారి సంతోష్, కోశాధికారిగా యేల్మల శంకర్, గౌరవాధ్యక్షులుగా బొబ్బిలి కిషన్, బంటు గంగాధర్, ముఖ్య సలహాదారులుగా ఆకుల శ్రీశైలం, ఆమ లడ్డు శంకర్, పెద్ద కాపులుగా హరిదాసు మారుతి, దారం పోతన్న,ఉపాధ్యక్షులుగా నాగుర్త ధర్మేందర్, వైశాక్షి సంతోష్, కార్యనిర్వహణ కార్యదర్శులుగా కర్క రమేష్, ముకుందం శ్రీనివాస్, ప్రచార కార్యదర్శులుగా ముద్దం ఆంజనేయులు, నక్క రఘునందన్, సోమిరెడ్డి జగదీష్, సలహాదారులుగా కోళ్ల సురేందర్, పుప్పాల ప్రదీప్, వంతుల ముత్యం, కార్యవర్గ సభ్యులుగా తోట నరేష్, బొల్లం అంజి రెడ్డి, ఆకుల తిర్మల్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు హరిదాసు సాయి రెడ్డి, ప్రధాన కార్యదర్శి కులచారి సంతోష్, కోశాధికారి ఎల్మల శంకర్ మాట్లాడుతూ.. గత 20 సంవత్సరాల క్రితం సంఘాన్ని ప్రారంభించామని, ఎన్నో వ్యయ ప్రయాసాలకు ఓర్చి సంఘ భవనాన్ని నిర్మించుకున్నామని మొదట బాబన్న, సాయి రెడ్డి, రఘునందన్, మారుతి లతో కలిసి ప్రారంభమైన పంచముఖి మున్నూరు కాపు సంఘము 90 మంది సంఘ సభ్యులుగా చేరడం సంతోషంగా ఉందని అన్నారు. కుల బంధువులందరూ ఒక వేదిక మీద కలవాలని, మంచి చెడ్డ పంచుకోవాలని ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశామన్నారు. దీనికి కుటుంబ సభ్యులతో హాజరు కావడం సంతోషంగా ఉందన్నారు. ఇకపై ప్రతి రెండేళ్లకోసారి ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తామని అన్నారు. సంఘం అభివద్ధి కోసం ఎల్లవేళలా పాటుపడతామని, సంఘ సభ్యులకు అందుబాటులో ఉండి సంఘాన్ని మరింత అభివృద్ధి అయ్యేలా మా వంతు తోడుపాటునందిస్తామన్నారు. అనంతరం సంఘ సభ్యులతో కలిసి భోజనం చేశారు. కార్యకమంలో మున్నూరు కాపు సభ్యులు మాజీ తొలి మహిళ మేయర్ ఆకుల సుజాత, జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షురాలు లక్ష్మి, శ్రీనివాస్, మున్నూరు కాపు సంఘం సభ్యులు, మహిళలు, పిల్లలు పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలని అర్ధనగ్న ప్రదర్శన

- 41వ రోజుకు రైల్వే సాధన కమిటీ దీక్షలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ప్రజల చిరకాల వాంఛ అయిన ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వే లైన్‌కు మార్చి 3న కెబినేట్ సమావేశంలో చర్చించి ఆమోదం తెలిపి నిధులు కేటాయించాలని, రైల్వేలైన్ సాధన కమిటీ చైర్మెన్ సిర్ర దేవేందర్ అన్నారు. ఆర్ అండ్ బి ఎదుట చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం 41వ రోజుకు చేరుకోగా అర్ధనగ్న ప్రదర్శన చేసి కేంద్రం తీరును ఎండట్టారు. గత 40 రోజులుగా ఆర్మూర్ రైల్వేలైన్ కోసం రిలే దీక్షలు కొనసాగుతున్న కేంద్ర ప్రభుత్వం పట్టించుకోడం లేదని ఆరోపించారు. ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వేలైన్ కాకుండా నాగుల పల్లి, పఠాన్ చెరు వరకు రైల్వేలైన్ మంజూరు చేశారన్నారు. దాని వల్ల ఆదిలాబాద్‌కు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. మార్చిన 3న కెబినేట్ సమావేశం ఉందని, అందులో దీనిపై చర్చించి, బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి పనులకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమితి నాయకులు వెంకట్ నారాయణ, అఫ్సర్ ఖాన్, మెస్రం భాస్కర్, నరేందర్, నితీష్, దేవేందర్ పాల్గొన్నారు.

ఆదివాసీ సాంప్రదాయాలను భావితరాలకు అందించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకుంటూ, భావితరాలకు అందించాలని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. ఆదివారం హీరాసుక జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన గోండి ధర్మగురు హీరాసుక జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. బస్టాండ్ ఎదుట హీరాసుక ఆలయంలో పూజలు చేశారు. ఆదివాసుల సంస్కృతికి అనుగుణంగా పూజలు చేస్తూ జెండాను ఆవిష్కరించారు. అనంతరం రాంజీగోండ్, కుమ్రంభీం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ దేశంలో ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలు ఎంతో గొప్పవని తెలిపారు. వాటిని భావితరాలకు అందించేల కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా హీరాసుక జయంతిని అధికారికంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ సంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో హీరాసుక జయంతిని నిర్వహించేలా కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హీరాసుక జాగృతి నాయకులు సిడాం రాంకిషన్, మెస్రం కృష్ణ, గెడం జనార్దన్, గెడం మనోహర్, ఆదివాసీ పర్దాన్ సేవా సంఘం అధ్యక్షుడు దుర్వ నగేష్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ముగిసిన క్రికెట్ పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో గత నెల రోజుల పాటు అంజనీపుత్ర ఎస్టేట్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలు అట్టహాసంగా ముగిసాయి. ఈ పోటీల్లో బండలనాగపూర్ జట్టు విజేతగా నిలువగా రూ.50వేల నగదు, కప్ అందుకుంది. రన్నరప్ జట్టు రూ.30వేలు, మూడో స్థానంలో నిలిచిన బాలాపూర్ హనుమాన్ జట్టు రూ.20వేలు, నాలుగో స్థానం కైవసం చేసుకున్న చాందా(టి) జట్టు రూ.10వేల నగదును సంస్థ చైర్మెన్ గుర్రాల శ్రీధర్ చేతుల మీదుగా అందుకున్నాయి. ఈ సందర్భంగా గుర్రాల శ్రీధర్ మాట్లాడుతూ యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలనే లక్ష్యంతో ఈ క్రికెట్ పోటీలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ గుర్రాల కిరణ్, డిప్యూటీ డైరెక్టర్లు ప్రసన్నకుమారి, సరోజ, చీఫ్ జనరల్ మేనేజర్లు కే.కృష్ణ, లింగన్న, జనరల్ మేనేజర్ శ్యాంసుందర్, పోటీల నిర్వాహకులు మహేష్ జనగం, రాసర్ల మహేష్, పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అబాకస్, వేదిక్ మ్యాథ్స్‌లో

సత్యశోధక్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-సిరికొండ


టాపర్లుగా నిలిచిన విద్యార్థులు

విశ్వం ఎడ్యుటెక్ స్కూల్ ల్యాబ్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్ కూకట్ పల్లి పియస్ఎం హైస్కూల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి అబాకస్, వేదిక్ మ్యాథ్స్ పోటీలలో సత్యశోధక్ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ప్రథమ, ఇద్దరు విద్యార్థులు ద్వితీయ స్థానాలతో రాష్ట్ర స్థాయి టాపర్లుగా నిలిచి విజయదుందుభి మోగించారని ప్రిన్సిపాల్ నర్సయ్య తెలిపారు. విశ్వం ఎడ్యుటెక్ స్కూల్ ల్యాబ్ మేనేజింగ్ డైరెక్టర్ రవి కుమార్, ట్రస్మా రాష్ట్ర సలహాదారులు వై శేఖర్ రావ్ విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు అందించి అభినందించారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు అబాకస్ వివిధ విభాగాలలో వి. సాద్వి (జూనియర్ లెవెల్ 1 విజువలైజెషన్) టి. శివాని (జూనియర్ లెవెల్ 3), కె.అనణ్య పాటిల్ (సీనియర్ లెవెల్ 3) మరియు వేదిక్ మ్యాథ్స్ వివిధ విభాగాలలో పి.యశ్వంత్ (వాల్యూమ్ 1), పి. నవ్యశ్రీ (వాల్యూమ్ 2) రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించగా, అబాకస్‌లో యన్. కార్తీక (సీనియర్ లెవెల్ 2), వేదిక్ మ్యాథ్స్‌లో వి. వైశ్విక (వాల్యూమ్ 3) రాష్ట్రస్థాయి ద్వితీయ స్థానం సాధించారు. కార్యక్రమంలో విశ్వం సిఈఓ హరిచరణ్ ప్రతినిధులు మారుతి, వినాయక్, శివకుమార్, ఉపాధ్యాయులు గంగారెడ్డి, పూజిత్ తదితరులు పాల్గొన్నారు.

యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండాలి

నవతెలంగాణ-నార్నూర్

ఆధ్యాత్మికతోనే మానసిక ప్రశాంతత ఉంటుందని మాజీ జెడ్పీటీసీ రూపావతి న్యానోబా పుష్కర్, దళిత హక్కుల సాధన సమితి జిల్లా నాయకులు జాదవ్ శేఖర్ అన్నారు. ఆదివారం మండలంలోని ఖంపూర్ గ్రామంలో నిర్వహించిన హనుమాన్ అఖండ హరినామ సప్తహా ముగింపు కార్యక్రమంలో భాగంగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి సమాజంలో యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ సలాం ఆనంద్‌రావ్, ఎంపీటీసీ యత్మా బాయి దర్ము, గ్రామ పటేల్ సలాం కేశవ్, పెద్దలు తుకారాం మహారాజ్, గజానంద్, గోవింద్, తానాజీ గ్రామస్తులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-ఆదిలాబాద్

సిరికొండ మండల కేంద్రంలో సీసీరోడ్డు నిర్మాణానికి ఆదివారం ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా మండలంలోని ఆయా గ్రామాల్లో రూ.27 లక్షల నిధులతో నూతనంగా సీసీ రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నామని అన్నారు. గ్రామాలాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బాల గంగాధర్, మండల కోఆప్షన్ సభ్యుడు మాణిక్ రావ్, బీజేపీ మండల అధ్యక్షుడు అమోల్, నాయకులు బాలాజీ, అశోక్, గంగాధర్, రమేష్, సంతోష్, నాందేవ్, ప్రహ్లాద్ పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

నవతెలంగాణ-తాంసి

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని జామిడి గ్రామంలో శనివారం అర్థ రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నగరాడే బుద్ధ ప్రసాద్ ఇంటిలో అకస్మాత్తుగా ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ కావడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. పక్కనే ఉన్న మరో ఇంట్లో కుటుంబ సభ్యులు అందరూ పడుకొని ఉన్నారు. అర్థ రాత్రి సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగడంతో చుట్టూ పక్కల ఉన్న వారు గమనించి, కేకలు వేయగా లేచి చూసే సరికి తన సొంత ఇల్లు మొత్తం పూర్తిగా కాలిపోయింది. బుద్ధ ప్రసాద్ బ్రతుకుదెరువు కోసం సౌత్ ఆఫ్రికాలో మిల్ట్ కంపెనీలో పనిచేశాడు. ప్రస్తుతం గ్రామంలోనే ఉంటున్నాడు. ఇల్లు పూర్తిగా దగ్ధం కావడంతో ఇంట్లో ఉన్న వస్తువులు టీవీ, బెడ్స్, ఫర్నిచర్ మొదలైన వస్తువులతో పాటు బీరువాలో ఉన్న రూ 1లక్ష 22 వేల నగదు, బంగారం, విద్యార్హత కలిగిన సర్టిఫికేట్స్, ఆధార్ కార్డు, పాన్ కార్డు, పాస్‌పోర్ట్, బ్యాంక్ పాస్‌బుక్, గ్యాస్‌బుక్, ఏటీఎం కార్డుతో పాటు బర్త్ సర్టిఫికెట్స్ కాలిపోయాయి. సూమారు రూ.5 లక్షల వరకు ఆస్థి నష్టం జరిగిందని తెలిపారు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

మహాపురుషుల ఆలోచనలు ఎల్లప్పుడూ మనతోనే

- రవిదాస్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహాపురుషులు మన మధ్య లేకున్నా వారి ఆలోచన ద్వారా ఎల్లప్పుడూ మనతోనే ఉంటాయని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదివారం సంత్ రవిదాస్ జయంతి సందర్భంగా స్థానిక చిలుకూరి లక్ష్మీనగర్‌లో నిర్వహించిన జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక బలహీన వర్గానికి చెందిన వ్యక్తి తన ఆలోచనల ద్వారా సమాజాన్ని ఉత్తేజపరుస్తూ తన మాటల ద్వారా సామాజిక చైతన్యాన్ని తీసుకొచ్చిన మహా పురుషుడు సంత రవిదాస్ అని అన్నారు. నేడు అందరికీ విద్య, ఆధ్యాత్మికత ఆయన ద్వారా ఎంతో మందికి మార్గదర్శనాన్ని చేశాయని తెలిపారు. గత పాలకుల హయాంలో బడుగు బలహీనవర్గాల ప్రజలు కేవలం ఎన్నికల పావులుగా మాత్రమే ఉండిపోయారని అన్నారు. కానీ 2023లో జరిగిన ఎన్నికల్లో ప్రజలు చైతన్యవంతులై ఆ పాలకులకు బుద్ధి చెప్పారన్నారు. కేంద్రం ఎన్నో పథకాలను సామాజిక అభివృద్ధి కొరకు బలహీన వర్గాల అభివృద్ధి కొరకు చేపట్టింది. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు దాదారావ్, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రఘునాథ్ ఇట్కరే, గాయక్వాడ్ సంజయ్, సంతోష్ వింకరే, రాజు కదం, సందీప్ జంజల్కర్, బీజేపీ నాయకులు మహేందర్, జోగు రవి, పొచ్చన్న, ముకుంద్ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడలతోనే ఐక్యత భావం

నవతెలంగాణ-భైంసా

క్రీడలతోనే యువతలో ఐక్యత భావం పెంపొందుతుందని భైంసా ఎంపీపీ రజాక్, బీజేపీ నియోజకవర్గ నాయకులు శివాజీ పటేల్ అన్నారు. మండలంలోని దేగాం గ్రామంలో అనసూయ పవార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు వేడుకలకు హాజరై వారు మాట్లాడారు. యువత అన్ని రంగాల్లో రాణించాలన్న ఉద్యేశంతో ఎమ్మెల్యే రామారావు పటేల్ ఆధ్వర్యంలో టోర్నమెంట్లు నిర్వహించడం జరుగుతుందన్నారు. విజేతగా నిలిచిన జట్టుకు ఎమ్మెల్యే తరపున రూ.30 వేల నగదును ప్రోత్సాహక బహుమతిగా అందజేశారు. అదేవిధంగా రన్నర్ ఆఫ్‌గా నిలిచిన జట్టుకు రూ.15వేలను అందజేశారు. విజేతగా భైంసాకు చెందిన మిలన్ నిలువగా, రన్నారఫ్‌గా దేగాం జట్టు నిలిచింది. కార్యక్రమంలో బాసర మండల నాయకులు విశ్వనాథ్ పటేల్, భైంసా మండల నాయకులు సుభాష్ పటేల్, చందర్ పటేల్, చంద్రకాంత్ పటేల్, ఎమ్మార్పీఎస్ నాయకులు నందకుమార్, తుకారాం పాల్గొన్నారు.